Whatsapp No: 9440662699

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

RNI No. APTEL 2015/ 66622




# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 2 సంచిక 43, పేజీలు 8 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 17- ఆదివారం 23, జూలై 2017

## సచివాలయ ఉద్యోగుల బాధ్యతారాహిత్యం




- అనేకశాఖల్లో పెరిగిన గైర్హాజరు
- అవస్థలు పడుతున్న ప్రజానీకం

**రా.వా ప్రతినిధి- అమరావతి :** నవ్యాంధ్రప్రదేశ్‌లో సచివాలయం ఏర్పాటు చేసి ఏడాది గడిచినా ఉద్యోగులు పనిగంటలు మాత్రం పెరగలేదు సరికదా.. గైర్హాజరు ఎక్కువైందని ప్రభుత్వ అధ్యయనం తెలిపింది. సచివాలయ ఉద్యోగులు హైదరాబాద్ నుండి అమరావతికి పూర్తిగా తరలి రాకపోవటంతో ప్రతి శుక్రవారం హైదరాబాద్ వెళ్లటం మళ్లీ సోమవారం సచివాలయానికి రావటం చేస్తున్నారు. దీంతో సోమవారం మధ్యాహ్నం వరకు శుక్రవారం సాయంత్రం నుంచి ఆఫీసులు ఖాళీగా ఉంటున్నాయి. ప్రభుత్వం అన్ని రోజులు పని చేయాలని ఆశిస్తుండటంతో ఉద్యోగులు అమరావతికి రాకపోవటానికి ఇష్టపడకుండా మరిన్ని ప్రోత్సాహకాలు కోరుతున్నారు. దీంతో ప్రభుత్వం 5 రోజులు పని దినాలను 2018 వరకు పొడిగించింది.

మూడో వంతు ఉద్యోగులు గత మే నెల్లో గైర్హాజరయ్యారని అధ్యయనం నివేదించింది. ప్రతి శాఖలో కనీసం 36శాతం గైర్హాజరయ్యారని, సచివాలయ మొత్తంగా 43 శాతం ఉద్యోగులు మే నెలలో డుమ్మాకొట్టారని తేలింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 3.5శాతం మాత్రమే సెలవులకు అంగీకారం ఉండటంతో ఇంత ఎక్కువ మంది హాజరవ్వకపోవడం ప్రభుత్వానికి ప్రమాద సూచికగా మారింది. వెనుకబడిన తరగతులు శాఖ, ప్రభుత్వ సంస్థలు శాఖలలో ఏకంగా

- మిగతా 2 లో

**రా.వా ప్రతినిధి- అమరావతి :** రాజధానిలో ఎక్స్‌ప్రెస్ రహదారుల నిర్మాణాన్ని ఏడాది కాలంలో పూర్తి చేయాలనే తలంపుతో ప్రభుత్వం అన్ని హంగులు సమకూర్చుకున్నప్పటికీ అత్యవసరమైన భూముల విషయంలో సమస్యలు తలెత్తటంతో పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. దీంతో సమస్యలు ఉన్న



## ఎక్స్‌ప్రెస్ హైవేలకు భూ అడ్డంకులు

### అంతర్గత రోడ్లకు త్వరలో టెండర్లు

భూములను మినహాయించి మిగిలిన ప్రాంతాల్లో ముక్కలు ముక్కలుగా రహదారుల నిర్మిస్తూ కాంట్రాక్టర్లు ముందుగా సాగుతున్నారు. ప్రధానంగా రాజధానిలోని 29 గ్రామాలను అనుసంధానం చేస్తూ ఈ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీ కారం చుట్టింది. సీడ్ యాక్సిస్ రోడ్డుతో పాటు మరో ఏడు రోడ్ల నిర్మాణానికి ఏడాది ఉగాదిన శంకుస్థాపన జరిగింది. రూ.995కోట్ల అంచనాతో నిర్మాణం జరుగుతోంది. సీడ్ యాక్సిస్ రోడ్డుతో పాటు నిర్మాణంలో ఉన్న రోడ్ల వివరాలు ఇలా ఉన్నాయి. మొత్తం ఏడు రోడ్లలో రెండు రోడ్లు ఆరు లైన్లు, ఐదు రోడ్లు నాలుగు లైన్లతో నిర్మాణం జరుగుతోంది. రూ.247 కోట్లతో కిష్టాయపాలెం- నెక్కల్లు వరకు 14.85 కిలోమీటర్లు, రోడ్డుకు భూ అడ్డంకి లేకున్నా, రూ.196కోట్లతో ఉద్దండరాయునిపాలెం- నిడమర్రు వరకు నిర్మిస్తున్న 18.96 కిలోమీటర్ల రోడ్డుకు నిడమర్రు, మల్కాపురం వద్ద భూమిని సేకరించాల్సి ఉంది. రూ.124 కోట్లతో నిర్మిస్తున్న వెంకటపాలెం - నవులూరు రోడ్డుకు, కిష్టాయిపాలెం, నవులూరులో

- మిగతా 2 లో

## వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తా : జలీల్‌ఖాన్



**రా.వా.ప్రతినిధి-విజయవాడ :** వక్ఫ్ ఆస్తులను పరిరక్షించి ముస్లిం మైనార్టీలను ప్రభుత్వపరంగా ఆదుకుంటానని వక్ఫ్ బోర్డు చైర్మన్ జలీల్‌ఖాన్ తెలిపారు. విజయనగరం జిల్లా , కృష్ణా జిల్లా చీమలపాడుకు చెందిన ఆస్థాన ఆసాయే తాజ్ ఖాధిరియా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులయిన జలీల్‌ఖాన్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. గతంలో అనేక ప్రాంతాల్లో వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతానికి గురిఅయ్యాయని అటువంటి భూములను గుర్తించి వాటిని పరిరక్షించడంతో పాటు పేద,ముస్లిం మైనార్టీ వర్గాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని వారు జలీల్‌ఖాన్‌ను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ముస్లిం మైనార్టిలను అభివృద్ధి పదంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఆయన సహకారంతో మైనార్టీల సంక్షేమం కోసం నిరంతర కృషి చేస్తానని ఇందుకు ముస్లిం మత పెద్దల సహకారం ఎంతో అవసరమన్నారు. ఆస్థాన ఆసాయే తాజ్ ఖాధిరియా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఖలీల్‌ఉల్లా షరీఫ్ మహ్మద్ , జాఫర్ షరీర్ మహమ్మద్, షేక్ ఫైజాన్, పర్వేజ్ అహమ్మద్, నౌమాన్ జాఫర్‌లు ఆయనను అభినందించిన వారిలో ఉన్నారు.

## నీరుకొండలో ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రారంభం

**అమరావతి :** రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రతిష్టాత్మక ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో మొక్కలు నాటారు. రాజధానిలో తొలి ప్రైవేట్ విశ్వవిద్యాలయం ఇదే. ఈ నెల 19 నుంచి ప్రతిష్టాత్మక విద్యాలయం విట్ కూడా ప్రారంభం కానుంది.మంగళగిరి మండలం నీరుకొండ వద్ద నిర్మించిన ఈ వర్సిటీలో ఆగస్టు 7 నుంచి తరగతులు ప్రారంభం కానుండగా ఈ ఏడాది 240 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు, మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






# రాజధాని వార్తలు

కలం

## విద్యావైద్యంతోనే ప్రగతి

రాష్ట్ర ఆర్థికాభివృద్ధితోపాటు ప్రజలు ప్రగతిబాటలో పయనిస్తానికి విద్యావైద్యం ముఖ్య భూమికను పోషిస్తాయి. ప్రభుత్వం ఇప్పటికే 4000 ప్రభుత్వ పాఠశాలలను క్రమబద్ధీకరణ పేరుతో మూసివేసి రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను మిధ్యగా చేస్తోంది. ఇది చాలదన్నట్లు ఏపీ సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ చట్టం 2017 ప్రవేశపెట్టి ప్రైవేటు విద్యను బలోపేతం చేస్తోంది. కొన్నిపాఠశాలలకు స్వయం ప్రతిపత్తిని కూడా కల్పించబోతోంది. అంటే పరోక్ష పద్ధతిలో ప్రభుత్వ విద్యను సమూలంగా నాశనం చేసే ప్రక్రియకు తెరలేపింది. సమాజంలో విద్యావైద్యం ప్రాధాన్యతను గుర్తించి ప్రతిపక్షనేత వైఎస్ జగన్ ఈ రెండు అంశాలకు అగ్రతాంబూలం ఇవ్వాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. 1 నుంచి 5 వ తరగతి వరకు చదివే విద్యార్థులకు నెలకు రూ.500, 5 నుంచి 10వ తరగతి వరకు రూ.750, కాలేజీ విద్యార్థులకు రూ. 1000 హాస్టల్ విద్యార్థులకు ఏడాదికి రూ. 20 వేలు ఇవ్వడం లాంటి ఎన్నికల వాగ్దానాలు కాకుండా ప్రభుత్వ పాఠశాలలను పునరుద్దరించి, నాణ్యమైన విద్యను అందిస్తామని భరోసా ఇవ్వాలి. వ్యక్తులకు ప్రయోజనం కల్పించే విధంగా కాకుండా ప్రజాధనాన్ని సమాజాభివృద్ధికి ఉపయోగపడేలా మౌలిక వసతులతో కూడిన పాఠశాలల పక్కా భవనాలు నిర్మించాలి.

వైఎస్సార్ ప్రకటించిన రీఎంబర్స్‌మెంట్‌తో పేదవిద్యార్థులు చదువుకుంటున్న మాట నిజమే అయినప్పటికీ ఏటా కోటాను కోట్లు ప్రైవేటు కాలేజీలకు గుమ్మరించడం కంటే ప్రభుత్వ కాలేజీలు ఏర్పాటుచేస్తే అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్య అందించవచ్చు. దీంతో మధ్యతరగతి వర్గానికి ఆర్థికంగా వెలుసుబాటు ఉంటుంది. విద్యాకమిటీల్లో ఆ నియోజక వర్గ ప్రజాప్రతినిధులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యులను చేసి విద్యాప్రమాణాలు పెంపు చేసి కార్పొరేట్ స్కూళ్లకు, కాలేజీలకు చెక్ చెబితే మధ్యతరగతి కుంటుంబాల ఆనందానికి హద్దుండదు. అమెరికాలాంటి అగ్రదేశాల్లో ప్రభుత్వ విద్యావిధానానికి ప్రైవేటు విద్య ఎంతమాత్రం సాటిరాదు. మనరాష్ట్రంలో కూడా అదే ప్రక్రియను ప్రవేశపెట్టాలి. ప్రజలకు కూడు,గుడ్డ, నీడతోపాటు అత్యవసరమైన విద్య,వైద్యం అందరికీ అందుబాటులోకి తేవడానికి కృషిచేసి ప్రభుత్వాలు ప్రజల మన్నలను పొందాలి.

పేదవారికి కార్పొరేట్ వైద్యసేవలు పేరుతో ప్రజల డబ్బును ప్రైవేటు ఆసుపత్రులకు ధారపోయకుండా ప్రభుత్వ ఆసుపత్రునే కార్పొరేట్ ఆసుపత్రులుగా రూపొందించాలి. దీంతో, వేలకోట్ల ప్రజాధనాన్ని ఆదా చేయడం ద్వారా మరిన్ని ప్రజోపకార పనులను నిర్వహించవచ్చన్న విషయాన్ని రాష్ట్రప్రజలు,ప్రభుత్వాలు గుర్తించాలి. ప్రైవేటు ఆసుపత్రిలో ఒకసారి రోగగ్రస్తం అయితేనే వారికి ఎన్టీఆర్ వైద్యసేవలు (ఆరోగ్యశ్రీ) అందుబాటులో ఉంటాయి. ఆపై ఏమన్నాజరిగితే ఆస్తులు అమ్ముకో వాల్సిందే. లేదంటే ప్రాణాలు కోల్పోవాల్సిందే. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రైవేటు వైద్యసేవలు కాకుండా ప్రభుత్వవైద్యసేవలు ఎల్లకాలం అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలి. అందుకోసం మేలైన ప్రణాళికలను అమలు చేయాలికాని, అంతేకాని అలవికాని వాగ్దానాలతో నేలవిడిచి సాము చేయకూడదు.

భాద పెట్టేవాడు తనవల్ల
ఎదుటివాడు ఎంత నరకం
అనుభవిస్తున్నాడో అర్థం చేసుకోడు

భాద పడేవాడు ఎంత అనుభవిస్తున్నాడో
పూర్తిగా అర్థం అయ్యేలా చెప్పలేడు

పౌరులు-చట్టాలు

## 24గంటల్లో మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలి



కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
కన్సల్టింగ్ ఎడిటర్, హైకోర్టు న్యాయవాది
98495 68901/83309 68901
katuruRavindraTrivikram@gmail.com



20 సుప్రీంకోర్టులో, మెనకా గాంధీ వి.ఎస్. యూనియన్ ఆఫ్ ఇండియా (AIR-1978)SC-597విచారణతర్వాత, రాజ్యాంగం 21వ అధికరణానికి మరికొన్ని ప్రాథమికహక్కులుజోడించబడ్డాయి.న్యాయప్రక్రియ (PROCEDURE OF LAW) ఎలా ఉండాలో సుప్రీంకోర్టు తెలియజేసింది. ఏకపక్షంగా ఉండకూడదు. సత్యము, న్యాయము,నిష్పక్షపాతము (RIGHT,JUST AND FAIR) అనే అంశాల మీద ఆధారపడి ఉండాలి.జస్టిస్ భగవతి (అప్పటి ప్రధాన న్యాయమూర్తి) తెలిపారు. ఇప్పుడు విస్తృతమైన హక్కుల జాబితా చూద్దాం..

(ఎ) వేగంగా క్రిమినల్ కేసు విచారణ, అందుకు అధికంగా క్రిమినల్ కోర్టుల ఏర్పాటు.

(బి) బెయిల్ పొందేవారు : ప్రతి నిందితుడు కోర్టుకు తగిన హామీలు చూపి బెయిల్ పొందేహక్కు ఉంది.

(సి) న్యాయ సహాయం పొందేహక్కు (Right to legal aid)

(డి) మానవీయ గౌరవహక్కు(Right to human dignity)

(ఇ) సంకెళ్ళ వేయకుండా ఉండటం (ప్రత్యేక పరిస్థితులలో తప్ప)నిందితుడి హక్కు.

(ఎఫ్) పోలీసులు భౌతికహింసలకు గురి చేయకుండా హక్కు(Right against use of third degree methods by police)

(జి) బందీగా ఉన్న వ్యక్తి తన లాయరు మరియు బంధువులతో మాట్లాడే హక్కు(Rightof a determe to have interview with his lawer and family membrs)

(హెచ్) క్రూరమైన, అసాధారణమైన శిక్షకు గురిచేయకుండా రక్షణహక్కు (Right against cruel and unusual punishment )

(ఐ) వెట్టిచాకిరి నుండీ విముక్తిపునరావాస హక్కు(Right of release and rehabilitation of bonded labour)

(జె)ప్రాథమికహక్కుల భంగానికి నష్టపరిహారం (Right to compensation for violation of fundamental Rights) ఇవన్నీ వివిధ కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చినతీర్పుల ద్వారా ఇవ్వబడిన హక్కులు.

(4) అరెస్టు,బంధిఖానాకు వ్యతిరేకంగా రక్షణ (Protection against arrest and detention)భారత రాజ్యాంగం వ్యక్తిగత స్వేచ్ఛకు హామీ ఇచ్చింది. హామీ అమలు క్రింది విధానాల ద్వారా అమలు జరుగుతుంది.

(ఎ) చట్టప్రకారం అవసరమైతే తప్ప ఏ వ్యక్తి వ్యక్తిగత స్వేచ్ఛ హరించటం జరగదు.

(బి) ఏక పక్షంగా అరెస్టు చెయ్యడం, బంధిఖానిలో ఉంచడానికి వ్యతిరేకంగా **(అధికరణం22)కొన్ని రక్షణాత్మక చర్యలు :**

(1) అరెస్టు అయిన వ్యక్తికి, అరెస్టుకి గల కారణాలు వీలైనంత వెంటనే తెలియజేయకుండా బందీగా ఉంచకూడదు.

(2) అధికరణం 22(1) ప్రకారం తన ఇష్టమైన లాయరును తన తరపున నియమించుకునే హక్కు ఉంటుంది.

(3) అరెస్టు,బందీఅయిన వ్యక్తికి ప్రయాణ సమయాన్ని మినహాయించి 24 గంటలలోపు సమీపంగా ఉన్న మేజిస్ట్రేటు ముందు హాజరు పరచాలి.

(4) మేజిస్ట్రేటు ఉత్తర్వు లేకుండా 24 గంటలు దాటి ఏ వ్యక్తినీ బందీగా ఉంచకూడదు. (అధికరణం 22(2)) అయితే, ఈ రక్షణలు దేశద్రోహులకు,శత్రువులకు, ముందస్తు అరెస్టు కేసులకు వర్తించవు.

(సశేషం)

## ఎక్స్‌ప్రెస్ హైవేలకు భూ అడ్డంకులు

(మొదటిపేజీ తరువాయి)

భూమిని సేకరించాల్సి ఉంది. 118 కోట్లతో బోరుపాలెం- శాఖమూరు, రూ.120కోట్లతో పెనుమాక- ఐనవోలు, నీరుకొండ వరకు రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయినప్పటికీ రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ముందుకు వెళ్ళాలని శత విధాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కొంతమంది రైతుల భూములు ఇవ్వకపోవటంతో సమస్యలు చోటు చేసుకున్నాయి. రాజధాని మొత్తంలో ప్రధానమైన సీడ్ యాక్సిస్ రోడ్డుకు దాదాపు 40 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ రోడ్డు నిర్మాణంలో కొన్ని గృహాలు కూడా తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామస్తులు ఇళ్లను వదులుకొనేందుకు సంసిద్ధంగా లేమని తెగేసి చెప్పారు.దీంతో రైతుల నుంచి నయానా భయానా భూములను సొంతం చేసుకోవాలనే ప్రయత్నంలో భాగంగా భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయినప్పటికీ రైతులు భూములు ఇచ్చేదిలేదంటూ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నా భూ సమస్య కారణంగా అనుకున్న సమయానికి రోడ్ల నిర్మాణం పూర్తి చేయటం కష్టమేనని అధికారులు అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం రోడ్ల నిర్మాణం అనుకున్న సమయానికి పూర్తి చేయాలని అధికారులకు హుకుంజారీ చేశారు. పై రోడ్లన్నిటికీ మార్గమధ్యలో ఉన్న సగటున నాలుగు ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. భూ సేకరణ ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఆయా ప్రాంతాలను వదిలి మిగిలిన ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం పనులు సాగుతున్నాయి. అయితే రైతులను ఏదో విధంగా ఒప్పించి రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూములను వివాదం లేకుండా సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా రాజధానిలోని 24 రెవెన్యూ గ్రామాల్లో 2 గ్రామాలకు అధికారులు లేఅవుట్‌లు వేసి ప్లాట్లకు పెగ్‌మార్కింగ్ కూడా ఇచ్చారు. ఈ లేఅవుట్‌లలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచే పనిలో సీఆర్‌డీఏ ఇంజనీరింగ్ విభాగం నిమగ్నమై ఉంది. రైతులను మెప్పించే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం అన్ని గ్రామాలను కలుపుతూ వేస్తున్న రహదారుల రూపురేఖలను అధికారులు గ్రామస్తులకు వివరిస్తున్నారు. ఈ ప్రయత్నం ఎంతవరకు సఫలీకృతమవుతుందో వేచి చూడాల్సిందే..

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన



**విశాఖపట్నం :** వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రుతుపవనాల ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో ఒక మోస్తరుగా వర్షాలు పడతాయి. తెలంగాణలో అనేకచోట్ల, కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. కోస్తాలో తీరం వెంబడి గంటకు 45 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తున్నాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా తీరం వెంబడి ఉరుములతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కాగా ఉపరితల ప్రభావంతో రానున్న 3రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నది. ఇది బలపడే క్రమంలో రుతుపవనాలు చురుగ్గా మారనున్నాయి. దీంతో కోస్తా, తెలంగాణాల్లో ఈనెల 17,18 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

## సచివాలయ ఉద్యోగుల బాధ్యతారాహిత్యం

(మొదటిపేజీ తరువాయి)

61శాతం ఉద్యోగులు విధులకు హాజరుకాలేదు. మైనారిటీ సంక్షేమశాఖ లో తక్కువగా 24 శాతం మంది గైర్హాజరయ్యారని అధ్యయనం పేర్కొంది. ఉద్యోగులు 60 శాతం కంటే ఎక్కువ శాతం గైర్హాజరు కావడం పట్ల అధికారులకు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పనివేళ సమయాలు ప్రభుత్వ పనితీరుపై ప్రభావం చూపుతాయని సీనియర్ అధికారులు వాపోతున్నారు.

ప్రజలు కట్టే పన్నులు ఈ విధంగా నిరుపయోగం కావడం బాధగా ఉందని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు వెల్లడించారు. ఉద్యోగుల్లో బాధ్యతా రాహిత్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ సిస్టంను ప్రవేశ పెట్టింది. ప్రభుత్వ కార్యదర్శులు గైర్హాజరు ఎందుకు ఎక్కువగా ఉండటంతో పరిశీలన జరిపి దీన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వంఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగులు సచివాలయంలోనికి వెళ్లే ముందు, ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లే సమయంలో బయోమెట్రిక్ వ్యవస్థలో నమోదు చేయాలని ఆదేశించింది. సచివాలయంలో మొత్తం 31 శాఖల్లో 1,248 మంది ఉద్యోగులు ఉన్నారు.ఎవరైనా ఉదయం 10.45 తరువాత వస్తే సగంరోజు సెలవుగా, సాయంత్రం 2.30 తరువాత వస్తే పూర్తి పని దినాన్ని సెలవుగా పరిగణిస్తారు.

**40 శాతం కంటే ఎక్కువ గైర్హాజరైన డిపార్టుమెంట్లు**

వెనుకబడిన తరగతులు సంక్షేమశాఖ, సివిల్ సప్లయిస్ శాఖ, ఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమ శాఖ, ప్రణాళికా శాఖ,గృహ నిర్మాణశాఖలైన్ షాడో ప్రాంతాల అభివృద్ధి శాఖల్లో హాజరుకాని శాతం 40శాతంగా ఉంది. దీంతో పాలనాపరంగా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

# ఆలోచనలే అనారోగ్యానికి కారణం



Dr. DWIBHASHYAM KASI VISHWANATH TEJASWI
B.A.M.S
CHINTALURU AYURVEDA PHARMACY
9032990138/ 9393990138
email:
dr.d.vishwanath@gmail.com

పార్టు 6



ప్రస్తుతం మన సమాజంలో ప్రజలు అనేకరకాలయిన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఏదో ఒక రోగం బారినపడుతూ వున్నారు. ఈ వ్యాధులకు కారణం ఆలోచన. ఆలోచనలే ఎన్నో అనారోగ్యాలకు మూలం. ఈ ఆలోచనలన్నీ మనస్సులోంచి పుట్టినవే. అయితే శరీరం వేరు మనం వేరు కాదు. ఇతరుల్ని ద్వేషించటం వల్ల కానీ మనకు నచ్చని విషయాలు పదే పదే గుర్తుచేసుకోవటం వల్ల కానీ, తరచూ ఎదుటివారు అదే పనిగా మనల్ని ద్వేషించటం వల్ల కానీ, అవమానం చేసి ఆనందించటం వల్ల కానీ మనకు తెలియకుండానే మనలోకి జబ్బులు (సైకిక్ లెవల్లో) మానసిక స్థాయిలో మొదలు పెట్టి మెల్ల మెల్లగా శారీరక వ్యాధులుగా మారతాయి. ఎలా అంటే మనసులో కలిగే ఆలోచనల వలన శరీరంలో అనేక రసాయనిక మరియు విద్యుత్ మార్పులు జరుగుతాయి.

**ప్రతి వ్యాధికి నాలుగు స్థాయిలుంటాయి :**
**1) సైకిక్ స్టేజ్,2) సైకోసొమాటిక్ స్టేజ్,3) సొమాటిక్ స్టేజ్, 4) ఆర్గానిక్ స్టేజ్.**

కేవలం ఆలోచనల రూపంలో వున్న విషయాలని ఒక స్థాయిలో ఆర్గానిక్ బాడిలో మార్పులు తీసుకు వస్తాయి. ఒక జబ్బు నయం కావాలి అంటే మానసిక సంకల్పం కూడా ఎంతో అవసరం. అందుకే మన సమాజంలో మానసిక వైద్య నిపుణులకు మంచి గుర్తింపు. గౌరవం వున్నాయి. ఎంత పెద్ద జబ్బుతో అయినా రోగి వైద్యుని దర్గరకు వెళ్తే మీకేం పరవాలేదు. మీ జబ్బు తర్వగా నయమైపోతుంది. అని ఆఖరి నిమిషం వరకూ వైద్యుడు చెప్పే మాటల ప్రభావం రోగికి సగం బలాన్ని, ధైర్యాన్ని ఇస్తుంది. ఈ రోజుల్లో వైద్య విజ్ఞానం ఎంత పెరిగిందో దానికి రెట్టింపు రోగాలు పెరిగాయి.

ఎందువల్ల అంటే ఆ రోజుల్లో శారీరక శ్రమ వుండేది. తినే ఆహారం కూడా స్వచ్ఛంగా ఉండేది. రుచిగా కూడా వుండేవి. మరి ఈ రోజుల్లో శాస్త్ర పరిజ్ఞానం ఎంత పెరిగినా, సాంకేతిక పరిజ్ఞానంతో పారిశ్రామికాభివృద్ధి ఎంత సాధించినా మనం అనుకున్నంత ఆనందం ఎందుకు పొందలేకపోతున్నాం. మనలో చాలా మంది విదేశాలలో పుట్టటం ఎంతో గొప్ప అదృష్టమనీ, అక్కడ స్వర్గ భోగాలు వుంటాయనీ, పొల్యూషన్ వుండదనీ, అక్కడ పుట్టటమే ఎంతో పుణ్యం చేసుకున్న వారికి మాత్రమే లభ్యం అనీ భావిస్తూ వుంటారు.

సరే మన దేశంలో దారిద్ర్యం ఎక్కువ. పొల్యూషన్ ఎక్కువ. స్వర్గ భోగాలూ లేవు. నిజమే మరి, ఒప్పుకోవాల్సిందే. మరి ఇవన్నీ పుష్కలంగా వున్న దేశాల్లో ప్రజలకు బాధలు లేవా? రోగాలు రావా? వారికి మృత్యువు లేదా? వారికి అశాంతి అనేది లేదా? ఇవన్నీ విదేశీ వ్యామోహంలో తడిసి ముద్దవుతున్నవారు ఎందుకు ఆలోచించ లేకపోతున్నారు.

నిజానికి ఏ దేశంలో ప్రజలూ సుఖ శాంతులతో కానీ మనశ్శాంతితో కానీ తులతూగి పోవటం లేదు. దూరపు కొండలు నునుపని మనం ఒక భ్రమలో బ్రతికేస్తున్నాం. ఇందుకు కారణం మనస్సే.

ఈ మనస్సు భావోద్రేకాలకి గురయినప్పుడు "ఎడ్రినల్ గ్రంథి, థైమస్ గ్రంథి, పాంక్రియాసిస్, గోనాయిడ్స్ అనే మన శరీర భాగాలపై భారం ఎక్కువగా పడుతుంది. ఎప్పుడయితే శరీరంపై భారం పడిందో అప్పుడు మన ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తుంది. అలాటప్పుడే మనకు అనేక రోగాలు వస్తాయి. అప్పుడు కూడా పాపం ఈ మనస్సు ఎప్పుడూ విశ్రాంతి తీసుకోదు. జన్మ జన్మలుగా మిగిలిపోయిన సంస్కారాలు మనలో వుండటం వల్ల ఎన్నో కోరికలు కలుగుతూ వుంటాయి. ఆ సమయంలో మనసుని అంటే ఇంద్రియాలను అదుపులోకి తెచ్చుకోవాలి. (కళ్ళు, ముక్కు, చెవులు, నాలుక, చర్మం).

ఇలా ఇంద్రియాలను అదుపులోకి తెచ్చుకుని మనసుని ప్రతి విషయంలోనూ పాజిటివ్ ఆలోచనల వైపు మళ్ళిస్తూ వుండటం చాలా అవసరం. మన చుట్టూ ఎప్పుడూ ప్రశాంతమైన వాతావరణం వుండేలా చూసుకోవాలి. ఇలా కనుక మనం గట్టిగా సంకల్పించుకుంటే మన సంకల్ప బలమే మనకు ఒక చక్కని ధ్యానమార్గాన్ని నిర్దేస్తుంది.

భగవంతుడు సృష్టిని అద్భుతంగా సృష్టించటమే కాకుండా అంతకన్నా అద్భుతంగా మానవుని యొక్క శరీరాన్ని తయారు చేస్తాడు. ఈ మానవ శరీరంలో వాత, పిత్త, కఫాలను సమతుల్యపరచే రోగనిరోధక శక్తి, ప్రాణశక్తి కూడా ఇచ్చాడు. వివిధ అవయవాల సమూహంతోపాటు శ్వాసక్రియ, రక్త ప్రసరణ క్రియ, నాడీ చైతన్యం, జీవక్రియ, విసర్జక క్రియ, ప్రత్యుత్పత్తి క్రియ ఇలా ఎన్నో ప్రక్రియలు వాటంతట అవే జరిగిపోయేలా ఒక ఫ్యాక్టరీని మన శరీరంలో సృష్టించాడు ఆ భగవంతుడు.

(సశేషం)

# రేపే పోలింగ్

## 20న రాష్ట్రపతి ఎన్నిక ఫలితాల ప్రకటన..



రాష్ట్రపతి ఎన్నిక జూలై 17వ తేదీన జరగనుంది. దాని ఫలితాలు 20వ తేదీన వెలువడనున్నాయి. ఈసారి ఈ ఎన్నికలకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. ప్రస్తుత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పదవీ కాలం జూలై 24వ తేదీతో ముగుస్తుంది. 1992లో 70వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్ర పాలిత ప్రాంతంలో ఉండే విధాన సభల సభ్యులకు కూడా ఓటుహక్కు కల్పించారు. మొత్తం ఓట్ల విలువ 10,98,882. దాంట్లో 50 శాతం విలువ ఎంపీలకు, 50 శాతం ఎమ్మెల్యేలకు ఉంటుంది. ఆర్టికల్ 55 ప్రకారం ఎలక్టోరల్ కాలేజ్ సభ్యుల ఓటు విలువను ప్రత్యేక పద్ధతి ద్వారా లెక్కిస్తారు. ఎంపీల ఓటు విలువ ఒకేలా ఉన్నప్పటికీ ఎమ్మెల్యేలకు మాత్రం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం వేరుగా ఉండటం గమనార్హం. 50 శాతం కన్నా ఎక్కువ ఓట్లు సాధించిన వారే రాష్ట్రపతిగా ఎన్నికవుతారు.

**ఎన్నిక ప్రక్రియ**

రాష్ట్రపతిని ఎలక్టోరల్ కాలేజీ ఎన్నుకుంటుంది. ఇందులో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల సభ్యులు ఉంటారు. 2017 లెక్కల ప్రకారం ఎలక్టోరల్ కాలేజీలో సభ్యుల సంఖ్య 4896. వారిలో 776 మంది పార్లమెంటు సభ్యులు, 4,120 మంది ఎమ్మెల్యేలు. పార్లమెంటు సభ్యుల ఒక్కొక్కరి ఓటు విలువ 708. ఎమ్మెల్యేల ఓటు విలువ ఆయా రాష్ట్రాల జనాభాను బట్టి ఉంటుంది.సభ్యులందరి ఓట్ల విలువను లెక్కిస్తే.. 10,98,882 ఓట్లున్నాయి. ఈ ఎన్నికల్లో గెలవాలంటే ఎన్డీయే అభ్యర్థి అయినా.. విపక్షాల అభ్యర్థి అయినా గెలుచుకోవాల్సింది 5,49,442 ఓట్లు. అయితే, ఎన్డీయేకు 5,31,442 ఓట్లు ఉన్నాయి. ఇవి మొత్తం ఓట్లలో 48.3 శాతం. అంటే, ఎన్డీయే అభ్యర్థి విజయం సాధించాలంటే ఇంకా 1.7 శాతం ఓట్లు కావాలి. ప్రస్తుతం ఎన్డీయేకున్న బలం దాదాపుగా 5.31 లక్షలు. గెలుపు కోసం ఆ పార్టీకి ఇంకా ఇంచుమించు 18 వేలకు పైగానే ఓట్లు కావాలి. మరోవైపు.. ఇటీవలే సోనియాగాంధీ విందు సమావేశానికి హాజరైన పార్టీల లెక్కను పరిగణనలోకి తీసుకుంటే విపక్షాల వద్ద ఉన్న ఓట్ల సంఖ్య 3,98,357. ఇది 4.02 లక్షల దాకా పెరగుతుందని ఒక అంచనా.

ఏపీలో వైసీపీ, తెలంగాణలో టీఆర్ఎస్ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఎన్డీయే అభ్యర్థి గెలుపు నల్లేరుపై నడకే అని చెప్పొచ్చు. లోక్‌సభలో 26,196 ఓట్లు కలిగిన అన్నాడీఎంకే సైతం మద్దతు తెలిపినందున ఎన్డీయే ఇక తిరిగి చూసుకోవాల్సిన పనే లేదు.

**పార్లమెంటులో ఓటింగు**

ఎంపీలకు పార్లమెంటు భవనంలోని 62వ రూమ్‌లో పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంటు నియోజక వర్గాలు కలిపి 13 స్థానాలు ఖాళీగా ఉన్నాయని ఈసీ తెలిపింది.

**వెలగపూడిలో ఏపీ పోలింగ్ స్టేషన్**

నూతన రాజధాని అమరావతిలోని వెలగపూడి అసెంబ్లీ భవనంలో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రపతి పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసింది. అసెంబ్లీ భవనంలోని కమిటీ హాల్ 201లో పోలింగ్ జరుగుతుంది. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమితులైన శాసనసభ కార్యదర్శి కె.సత్యనారాయణరావు, డిప్యూటీ కార్యదర్శి పి.బాలకృష్ణమాచార్యులు పోలింగ్ పర్యవేక్షిస్తారు.

### ప్రత్యేక పెన్‌తోనే ఓటు

రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడానికి ఎన్నికల సంఘం ఓటర్లకు ప్రత్యేక పెన్ను ఇవ్వనుంది. హర్యానాలో గత ఏడాది జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఇంకు వివాదం నేపథ్యంలో, ఈసారి దేశవ్యాప్తంగా ప్రత్యేక పెన్ను వాడాలని ఈసీ నిర్ణయించింది. రాష్ట్రపతి ఎన్నికలు పేపర్ బ్యాలెట్‌తోనే జరగనున్నాయి. పోలింగ్ స్టేషన్లో అధికారులు బ్యాలెట్ పేపరుతోపాటు ఆ పెన్నును ఓటర్లకు ఇస్తారు. ఓటర్లు ఆ పెన్‌తోనే మార్కింగ్ చేయాలి. ఇతర పెన్‌లతో ఓటు వేస్తే ఆ బ్యాలెట్ చెల్లదని సీఈసీ జైదీ స్పష్టం చేశారు.

### విప్ వర్తించదు

మిగతా ఎన్నికలకు రాష్ట్రపతి ఎలక్షన్‌కు ఉండే ప్రధానమైన వ్యత్యాసం దీనికి విప్ వర్తించకపోవడమే. రహస్య బ్యాలెట్ ద్వారానే రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ జరుగుతున్నప్పటికీ, రాజకీయ పార్టీలు తమ తమ పార్టీల ప్రజా ప్రతినిధులకు విప్ జారీ చేయరాదని సీఈసీ తేల్చి చెప్పింది. ఓటర్లు ఏ రాజకీయ పార్టీకి చెందినవారు అయినప్పటికీ, ఫలానా అభ్యర్థికే ఓటు వేయాలని ఆ పార్టీలేవీ ఎలక్టోరల్ కాలేజ్ సభ్యులను ఆదేశించ లేవు. దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి పదవికి జరిగే ఎన్నికల్లో ఎలక్టరోల్ కాలేజ్ సభ్యులు ఎటువంటి ప్రలోభాలకూ లొంగకూడదనే ఉద్దేశంతో విప్ వర్తించని విధానాన్ని అమలు చేశారు.

## క్లిక్ చేస్తే ఇంటికే కూరగాయలు

**రా.వా.ప్రతినిధి, కేదారీశ్వరిపేట :** విజయవాడలో కూరలు కొనేందుకు ఇక నుంచి రైతు బజారుకో, మార్కెట్‌లో వెళ్లాల్సిన పని లేదు. ఆన్‌లైన్‌లో మీకు నచ్చిన కూరలు ఆర్డర్ ఇస్తే కొద్ది సమయంలోనే అవి మీ ముంగిట్లోకి వచ్చేస్తాయి. రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రారంభించిన ఈ ఆన్‌లైన్ కూరగాయల కొనుగోలును ప్రయోగాత్మకంగా కేదారేశ్వరపేట రైతు బజార్‌లో ప్రారంభించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, కృష్ణా జిల్లా యంత్రాంగం కలిసి ఒక యాప్ తయారు చేశాయి. ఈ యాప్‌ను మీ సెల్‌లో పెట్టుకుని దాని ద్వారా కూరగాయలకు ఆర్డర్ ఇస్తే రైతు బజార్ నుంచి ఆ కూరలు నేరుగా మీ ఇంటికి సరఫరా చేస్తారు. దశలవారీగా నగరంలోని అన్ని రైతు బజార్లకు వర్తింపచేస్తామని అధికారులు తెలిపారు. ఈ విధానంలో కూరగాయలు కొనుక్కోవాలంటే గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి 'ఇ - రైతుబజార్‌కృష్ణ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ యాప్‌లో మనం రిజిస్టర్ అవ్వాలి. తర్వాత నగరంలోని రైతు బజార్ల జాబితాలోకి వెళ్లి మనకు కావలసిన రైతు బజార్‌ను క్లిక్ చేస్తే అక్కడ లభించే సరుకుల వివరాలు వస్తాయి. వాటిలో మనకు కావలసిన వాటిని ఆర్డరు ఇస్తే మన పని అయిపోయినట్టే. కూరలు ఇంటికి వచ్చిన తర్వాతే డబ్బులు ఇవ్వవచ్చు.

## గేటెడ్ కమ్యూనిటీ కాలనీలను తలదన్నేలా ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ నిర్మాణం: చంద్రబాబు

**రా.వా.ప్రతినిధి- అమరావతి :** గేటెడ్ కమ్యూనిటీ కాలనీలను తలదన్నేరీతిలో ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ ఇళ్ళను చూడమచ్చటగా నాణ్యతతో నిర్మించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ముఖ్యమంత్రి తన నివాసం నుంచి పట్టణాల ఇళ్ళు నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏపీలో ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణం దేశానికి ఒక నమూనాగా ఉండాలని ఆకాంక్షించారు. సంపన్నుల ఇళ్ళకు దీటుగా పేదల ఇళ్ల నిర్మాణం జరగాలన్నారు. ఆకర్షణీయంగానే కాకుండా మన్నికతో వుండాలని సూచించారు. ఇల్లు అనేది ఒక ఆస్తి మాత్రమే కాదని, ఇదో పెద్ద సెంటిమెంటులాంటిదన్న విషయాన్ని అధికారులు గ్రహించాలన్నారు. జీప్లస్ 7 నిర్మాణాలకు నిధులు కావల్సి వస్తే రాష్ట్రప్రభుత్వం, లబ్ధిదారులు చెరిసగం భరించాలన్నారు. ఇల్లు సౌకర్యవంతంగా వుంటే వారి వాటా కింద ఎక్కువ భరించాలన్నారు. లబ్ధిదారుల సంతోషం, సంతృప్తే లక్ష్యంగా పక్కా గృహాల నిర్మాణం జరగాలన్నారు. ప్రతి ఇంటికి రూ.3లక్షలు సబ్సిడీ ఇవ్వడమేగాకుండా ఇళ్ళ స్థలం, రోడ్లు, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి అన్ని మౌలిక సదుపాయం ప్రభుత్వమే సమకూరుస్తుందన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్మించిన హౌసింగ్ కాలనీ పట్ల లబ్ధిదారులు సంతృప్తిగా ఉన్నారని , వీటిని పరిశీలించి మిగిలిన ప్రాంతాల్లో కూడా అదే తరహాలో నిర్మించాలని సూచించారు. ఒక్క నంద్యాల నియోజకవర్గంలోనే రూ.800 కోట్లతో పక్కాగృహాలను పేదలకోసం నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం పట్టణంలోని మూడు ప్రాంతాల్లో దాదాపు రూ.250 కోట్ల విలువైన భూమి కేటాయించామన్నారు.

## పర్యాటకరంగంలో 'విరాట్'



**విశాఖపట్నం :** యుద్ధ విమానాల వాహక నౌక ఐ.ఎన్.ఎస్ విరాట్‌ను పర్యాటకులను ఆకర్షించే విధంగా తయారుచేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. దీనికి కావలసిన సాంకేతిక,ఆర్థిక నివేదికను తయారు చేయటానికి నిపుణులైన సంస్థల నుంచి ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. టెండర్లలో ఎంపికైన నిపుణులు అంచనా వ్యయాన్ని ఇవ్వనున్నారు. ఈ టెండర్లు సమర్పించటానికి జూలై26న చివరి తేదిగా ప్రకటించింది. గత 40 సంవత్సరాలుగా సముద్రజలాలపై సేవలందించిన ఈ నౌక 2017 మార్చి 6 పదవీవిరమణ చేసి ప్రస్తుతం ముంబాయి నౌకాశ్రయంలో ఉంది.

## 1962 నాటి పరిస్థితులు



భారత్ జనాభా 46 కోట్లు
జీడీపీ 4290 కోట్ల డాలర్లు

చైనా జనాభా 63 కోట్లు
జీడీపీ 7012 కోట్ల డాలర్లు



2017లో భారత్ జనాభా 132 కోట్ల
జీడీపీ 11.8 లక్షల కోట్ల డాలర్లు

2017లో చైనా జనాభా 140 కోట్లు
జీడీపీ 2.45 లక్షల కోట్ల డాలర్లు
( భారత్‌కంటే 8రెట్లు ఎక్కువ)

భారత్
విదేశీమారకం
38,200 డాలర్లు



చైనా
విదేశీమారకం
3లక్షల కోట్ల డాలర్లు

మిలటరీ ఖర్చు
భారత్ 5,590 కోట్ల
డాలర్లు అణ్వస్త్రాలు 120



చైనా 21,500 కోట్ల డాలర్లు
(నాలుగు రెట్లు ఎక్కువ)
అణ్వస్త్రాలు , 260





## 2014 గణాంకాల ప్రకారం రక్షణ బలాబలాలు

| భారత్ | చైనా |
|---|---|
| సైనిక బలం 13,25,000 పైగా | సైనికబలం 2,225,000 |
| యుద్ధవిమానాలు 3500 | యుద్ధ విమానాలు 3,382 |
| వాటిలో 1334 జెట్‌ఫైటర్ విమానాలు | వాటిలో 3,382 జెట్ ఫైటర్ విమానాలు |
| యుద్ధ నౌకలు 150 | యుద్ధనౌకలు 285 |
| అణ్వస్త్రాలు | అణ్వస్త్రాలు |
| 50.70 క్షిపణులు | 200 మించి క్షిపణులు |
| అగ్ని 5- 5000 కిమీ | డీఎఫ్ 41 10,000కిమీ |
| జలాంతర్గాములు 12 | జలాంతర్గాములు 60 |
| యుద్ధట్యాంకులు 600 | యుద్ధట్యాంకులు 3,000 |
| యుద్ధవిమాన నౌకలు 1 | యుద్ధవిమాన నౌకలు 1 |



# అమెరికాకనుగుణంగా మోడీ అడుగులు





దేశంలో లౌకికతత్వానికి, విదేశాంగ విధానంలో అలీన విధానానికి మోడీ తిలోదకాలిచ్చారు. ఇందుకు కారణం ఆయన ఒక మతతత్వపార్టీకి చెందినవారు కావడం, రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మాత్రమే ఉండి జాతీయస్థాయి అధికారాలను చేపట్టకపోవడంతో అవగాహనారాహిత్యం కూడా ఒక కారణం కావచ్చు. దేశీయ నేతగా ఎదిగే సమయంలో ప్రతిపక్షాలను, స్వపక్షంలోని తిరుగుబాటు దారులు, అసంతృప్తవాదులను అధిగమించిన ఆయన ప్రపంచదేశాలతో మన దేశం ఏ విధానాలతో ముందుకు సాగుతుందన్న అవగాహన లేకపోవడమే కారణంగా చెప్పవచ్చు.

ప్రపంచంలోని ఏదేశానికీ మడుగులొత్తకుండా, ఏదేశాన్నీ భుజాన వేసుకోకుండా నిక్కచ్చిగా, నిర్భయంగా, వ్యవహరించడానికి భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అలీన విధానాన్ని ప్రవేశపెట్టారు. మనం ఏ దేశానికి మిత్రులుగా,లేదా శత్రువులుగా ఉండనక్కర్లేదు. దీనితో మన దేశసార్వభౌమత్వాన్ని నిలుపుకుంటూ అన్యాయమైపోతున్న అనేక దేశాల తరుపున మనం ప్రశ్నిస్తున్నాం. కాని ఇవేమీ పట్టించుకోని, తెలియని మోడీ సరిహద్దుదేశం చైనా గుర్రుగా ఉన్న సమయంలో దానితో మాటామంతి జరపకుండా అమెరికా ప్రయణించడం అక్కడ ట్రంప్ కావాలనే ఈయన్ను ఆకాశానికి ఎత్తేయండంతో మనం దాదాపు చైనాతో యుద్ధానికి సన్నద్ధమయ్యే పరిస్థితి దాపురించింది. నిజానికి అమెరికాతో ఇప్పటికిప్పుడు చర్చించాల్సిన విషయాలు కూడా ఏమీలేవు. 100 మానవరహిత యుద్ధ నౌకనలను ఇంతకు ముందే ఆర్డర్ చేశాము. దానికి ఇంధనాన్నికూడా అక్కడి నుంచే కొనుగోలు చేయాలి. నిజానికి అది మనకు తలకు మించిన భారం అంతేకాదు, ఇక్కడి ఐటీ కంపెనీలన్నీ హెచ్1బీ వీసాలపై ట్రంప్ నిషేధాన్ని ఎత్తివేయాలని, ప్యారీస్ ఒప్పంద అమలు గురించి అడుగుతారనుకున్నా తీవ్ర నిరాశే మిగిలింది. అంతకుముందే అటువంటి విషయాలు ప్రస్తావించవద్దని వైట్‌హౌస్ తేల్చి చెప్పింది. అమెరికాకు అనుగుణంగా మోడీ అడుగులు వేస్తూ ఉంటే ఎవరు మాత్రం పొగడరు..నిన్నకాక మొన్న పారీస్ ఒప్పందంకోసం అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ వద్దనుంచి డబ్బులు గుంజుతున్నాయని తీవ్రంగా భారత్‌ను దుయ్యబట్టిన విషయం తెలిసిందే. చైనాతో ఉన్న ఘర్షణవాతావరణాన్ని నిరోధించుకునే ప్రయత్నం చేయకుండా అమెరికా సహాయం చేస్తుందనుకోవడం కేవలం భ్రమే.. అది దేశాల మధ్య తగువులు పెట్టి యుద్ధసామాగ్రి అమ్ముకునే కపట దేశం అని మోడీ వర్గం గుర్తించకపోవడం శోచనీయం.

గత 70 ఏళ్లుగా ఇజ్రాయేల్‌ను ఏ ప్రధాని సందర్శించలేదు, దానిని దర్శించింది మోడీ మాత్రమే అని బాకా ఊదుతున్న ప్రభుత్వం మొదట ఒక విషయాన్ని గమనించాలి. అది మనకంటే ఒక ఏడాది తర్వాత రూపొందించబడిన దేశం. రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ యూదులపై జరిపిన మారణకాండ ఒళ్లు గగుర్పొడిచేదిగా ఉంది. యుద్ధంలో జర్మన్ ఓటమి తర్వాత అతిపెద్ద సమూహిక యూదు స్మశానాలను కనుగొన్న బ్రిటన్ బిత్తరపోయింది. ఆ సమయంలో వారికి సంయమనం కలిగించడానికి ప్రపంచంలోని యూదులంతా తమ దేశం ఇజ్రాయేల్ వెళ్లవచ్చని ఆదేశించడంతో అనేక దేశాల నుంచి యూదులు తమ దేశానికి తిరిగి వెళ్లారు. అలా వెళ్లిన వారు పాలస్తీనావాసులను చెరబట్టినందకు భారత్‌తో సహా మిగతా దేశాలన్నీ పాలస్తీనాకు మద్దతుగా నిలిచాయి. భారత్‌కు పాలస్తీనా విమోచనా సంస్థ అధ్యక్షుడు యాసిర్ అరాఫత్ ఎంతో ఆప్తుడు కూడా .. ఇజ్రాయేల్ – పాలస్తీనా రెండు దేశాలు కలసి మెలిసి ఉండాలని కోరుకునే దేశాల్లో భారత్ ఒకటి. పైగా ఇజ్రాయేల్ చుట్టుప్రక్కనున్న అరబ్ దేశాలకు శత్రుదేశంగా పరిగణిస్తారు. పీవీ నరసింహారావు సమయం నుంచి ఇజ్రాయేల్ నుంచి మనకు టెక్నాలజీ, అగ్రికల్చర్, రక్షణరంగంలోని యుద్ధసామాగ్రి దిగుమతులు చేసుకుంటున్నాం. అంతమాత్రంచేత దాని దుర్మార్గాలను ఎండగట్టటంలేదనుకోవడం పొరపాటు. వీటిన్నింటిమీదటా అవగాహనలేని బీజేపీ ప్రభుత్వం జబ్బలు చరుచుకోవడం కేవలం అవివేకం.

నిజానికి ప్రతిక్షణం అమెరికాను ఉత్తరకొరియా రెచ్చగొడుతూనే ఉంది, దానికి మద్దతుగా,చైనా రష్యాలు ఉన్నాయి. అవిరెండూ లేకపోతే ఎప్పుడో ట్రంప్ దానిపై యుద్ధం ప్రకటించేవారే.. దానికి మద్దతు ఇస్తూ ..చైనా అమెరికాను సవాలు చేయడమే దానికి నచ్చడం లేదు. అలా అని అది యుద్ధానికి సన్నద్ధం కాదు. అందుకే మోడీని ఆలింగనం చేసుకొని చైనాను రెచ్చగొట్టారు. దీంతో చైనా హిమాలయ ప్రదేశంలోని డోక్లామ్ పీఠభూమిలో కి చొచ్చుకొచ్చింది. అంతేకాదు మమ్మల్ని రెచ్చగొట్టొద్దు అంటూ 1962లో ఏం జరిగిందో గుర్తుందా అంటూ వార్నింగ్ కూడా ఇచ్చింది. ఈ పరిస్థితుల్లో జూన్ 13న అమెరికా అణురంగ శాస్త్రవేత్తలు కొందరు చైనా కంటే భారత్ రక్షణరంగం శక్తివంతమైనదంటూ కితాబునిస్తూ ప్రకటించడం అమెరికా మనల్ని కావాలనే యుద్ధంలోకి తోస్తుందని తెలియచెబుతుంది.

1962 తర్వాత ఇంత దారుణ పరిస్థితులు భారత్– చైనాలకు కలుగలేదు. హిమాలయాల్లోని డొక్లామ్‌ను భూటాన్‌దిగా భారత్



ప్రకటిస్తూంటే చైనా తనదని కాలుదువ్వుతోంది. భూటాన్‌కు చైనా, బ్రిటన్, అమెరికాలతో దౌత్యసంబంధాలు లేవు. రక్షణ, రాయబార వ్యవహారాలను భారత్ పర్యవేక్షిస్తోంది. భూటాన్‌లోని డోక్లామ్‌లో నిర్మించిన రోడ్డును చైనా తనదని,చెబుతుంటే అది భూటాన్‌కు సంబంధిత ప్రాంతమని ఆదేశ విదేశాంగ మంత్రి తెలిపారు. ఈ రోడ్డు మార్గం ద్వారా చైనా చొచ్చుకువస్తే సిక్కిం కూడా చైనా చేతికి అందుతుంది. యుద్ధం వస్తే బంగ్లాదేశ్‌కు ఉత్తరం వైపు బెంగాల్‌లోని సిరిగురి ప్రాంతం నుంచి ఈశాన్య భారత రాష్ట్రాలైన అసోం, మిజోరం, త్రిపుర,మణిపూర్, నాగాలాండ్, సిక్కిం, మేఘాలయ వేళ్లే మార్గం వరకు చైనా ఆధీనంలోకి వస్తుంది. బెంగాల్‌లోని ఈ రహదారినే చికెన్ నెక్ అంటారు. 1998లో చైనా– భూటాన్‌ల మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని చైనా ధిక్కరించిందని భూటాన్ చెబుతోంది. చైనాకు ఈ ప్రాంతంపై 1959లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం సార్వభౌమాధికారం ప్రకటించిందని చైనా వాదిస్తోంది.

ఒబామా సమయంలో ఆసియాపీవోట్ వ్యూహరచనలో భాగంగా చైనావ్యతిరేక కూటమిని అమెరికా అభివృద్ధి పరుస్తూ, ఆస్ట్రేలియా, జపాన్‌లతో చైనా వ్యతిరేక కూటమిని రూపొందిస్తోంది. ఇది చాలదన్నట్లు మధ్యాసియా, ఐరోపా,ఆఫ్రికా దేశాలను ఏకం చేసే సిల్క్ రోడ్డు నిర్మాణాన్ని చైనా చేపట్టింది. దీని నిర్మాణ ప్రారంభానికి అన్ని దేశాలను ఆహ్వానించినా భారత్ ఒక్కటే ఆక్రమిత కాశ్మీర్‌లో రోడ్డునిర్మాణం చేపట్టిందని చైనా ఆహ్వానాన్ని తిరస్కరించింది.

పాకిస్తాన్‌ను ఉగ్రదేశంగా గుర్తించాలని మోడీ ప్రపంచవ్యాప్తంగా తిరుగుతూ నినదిస్తున్నారు. అయితే చమురు నిల్వల కోసం ఇరాక్‌లో అమెరికా మొదలు పెట్టిన హింస ఇంకా జ్వలిస్తూనే ఉంది. ఆ కార్చిచ్చు మిగతా దేశాలకు కూడా విస్తరించి యుద్ధోన్మాదం, తిరుగుబాటుదార్లు, ఉగ్రసంస్థల హింసాత్మక చర్యలతో మధ్యఆసియా భీతావహంగా విలయతాండవం చేస్తోంది. ఒకప్పుడు సుఖసౌఖ్యాలతో బ్రతికే దేశాలవారిని తిండితిప్పలు లేనివారిగా కట్టుబట్టలతో పిల్లలను తీసుకొని మిగతాదేశాలకు శరణార్థులుగా వెళ్లేట్లు చేసిన దేశం అమెరికా. అంటే పాక్ కంటే తీవ్రవాద ప్రభుత్వం అమెరికాదని గుర్తుంచుకోవాలి.

మొదటి నుంచి ఉగ్రవాదానికి సహాయసహకారాలు అందించింది అమెరికా, ఇజ్రాయేల్, సౌదీ, ఖతార్ దేశాలే. ఆక్రమిత పాలస్తీనా భూబాగాన్ని దర్శించిన మోడీ ఒక్క పాలస్తీనీయుడినికూడా కలిసిరాలేదు. అయితే మనం మొదటినుంచీ పాలస్తీనాకు సంఫీభావం తెలుపుతున్నాం.. బీజేపీ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశభక్తి, లౌకికతత్వాలకు మసిపూసి ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని దేశంలో వెదజల్లుతోంది. ఇరుగుపొరుగు దేశాలతో పూర్తిగా తెగతెంపులు చేసుకునే తెంపరితనం ప్రదర్శిస్తోంది. నేపాల్‌లో మాధేశీయులను రెచ్చగొట్టి అనేక నెలలపాటు ఆదేశాన్ని అష్టదిగ్బంధం చేసింది. ప్రజలంతా నిత్యావసర సరుకులు లేకుండా అల్లాడిపోయారు. అంతకు ముందు ఈ పరిస్థితి ఎన్నడూ వారికి కలుగలేదు. వారు భారత్‌ను పూర్తిస్థాయిలో నమ్మిన పొరుగువారు.

మనకాశ్మీర్‌ను భారత పాలిత కాశ్మీర్‌గా అమెరికా సంభోదించినా మన నాయకులు నిరసన తెలుపలేదు. అమెరికా, బ్రిటీష్ మీడియాల్లో ఆక్రమిత కాశ్మీర్‌ను పాక్‌లో అంతర్భావంగా చూపుతూ భారతదేశ భూభాగాన్ని పటం నుంచి తొలగించినా కిక్కురుమనలేదు మన కేంద్ర విదేశాంగ మంత్రులు. ఇరాన్‌తో మనకు మంచి సంబంధాలు ఉన్నా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా తలపెట్టిన యుద్ధ సన్నాహాల్ని, అరెబ్ దేశాల ఇరాన్ వ్యతిరేక కూటమి ఏర్పాటు విషయంపై మోడీ పెదవివిప్పలేదు. దేశంలోని నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు , భారమవుతున్న విద్యావైద్యం వంటి మౌలిక సదుపాయాల కృషి జరపకుండా ప్రభుత్వం ప్రజల్ని మీడియాద్వారా రెచ్చగొట్టే యుద్ధోన్ముఖులను చేస్తోంది. ఏది ఏమైనా డోక్లామ్‌లోని 89 చదరపు కిలోమీటర్ల భూభాగం కోసం ఇరుదేశాలు కాలుదువ్వకూడదని రెండుదేశాల ప్రజలు కోరుకుంటున్నారు. యుద్ధభారాన్ని పన్నుల రూపంలో ప్రజలపై భారం వేయడం, యుద్ధంలో సైనికుల రూపంలో తనవారిని కోల్పోవడం అనాధలుగా పిల్లలు బ్రతుకును కొనసాగించడం ఎంతమాత్రమూ తగదు. అందుకే రెండు దేశాల మధ్య ఉద్రిక్తలను తగ్గించడానికి దౌత్యపరమైన చొరవ చూపాలి.

**– ఖాన్**

ఆధార్ కార్డు వలస భవిష్యత్తులో జరగబోయేది

## అందరూ తెలుసుకోండి...



ఒక కస్టమర్ హోటల్‌కి ఫోన్ చేసి బిర్యాని ఆర్డర్ ఇస్తున్నాడు.
వారిద్ధరి మధ్య సంభాషణ ..

**ఆపరేటర్ :** హలో... ప్యారడైజ్ హోటల్
**కస్టమర్ :** ఒక ఆర్డర్ తీసుకోండి ప్లీజ్..?
**ఆపరేటర్ :** మొదట మీ ఆధార్ కార్డ్ నెంబర్ చెప్పండి. సార్
**కస్టమర్ :** ఒక నిమిషం.. నా ఆధార్ నెంబర్ “1234 5679 9012”
**ఆపరేటర్ :** ఓ..కే.. మీ పేరు శ్రీ కాంత్, నెంబర్ 17, గాంధీ రోడ్, శ్రీనగర్ కాలనీ నుండి మాట్లాడుతున్నారు. మీ ఇంటి ఫోన్ నెంబర్ 408423666, ఆఫీస్ నెంబర్ 76452302, మొబైల్ నెంబర్ 0142662566, ఇప్పుడు మీరు మీ మొబైల్ నుండి మాకు కాల్ చేశారు.
**కస్టమర్ :** వావ్.. ఇన్ని నెంబర్లు ఎలా సార్ తెలుసుకున్నారు...?
**ఆపరేటర్ :** కేవలం ఒక్క ఆధార్ నంబర్ తో మీ డిటైల్స్ అన్ని తెలిసిపోతాయి సార్
**కస్టమర్ :** గుడ్... నాకు ఒక చికెన్ ఫ్రై బిర్యాని ఆర్డర్ తీసుకుంటారా?
**ఆపరేటర్ :** సార్.. నాకు తెలిసినంత వరకు అది వద్దనే చెప్తాను సార్.
**కస్టమర్ :** ఏ.. ఎందుకు?
**ఆపరేటర్ :** మీ మెడికల్ రిపోర్ట్స్‌ని బట్టి మీకు కొలెస్ట్రాల్ లెవల్ ఎక్కువగా ఉంది.
**కస్టమర్ :** ఎంటి...? అప్పుడు నేను ఏమి తినాలి..?
**ఆపరేటర్ :** మా దగ్గర ఉండే తక్కువ కొవ్వు వెజిటబుల్ బిర్యాని ట్రై చేసి చూడండి సార్.. అది బాగా నచ్చుతుంది..
**కస్టమర్ :** నాకు నచ్చుతుంది. అని మీకు ఎలా తెలుసు.. ?
**ఆపరేటర్ :** పోయిన వారం మీరు బాబాయ్ హోటల్‌లో వెజిటబుల్ బిర్యాని తిన్నారు. సార్...
**కస్టమర్ :** మై గాడ్.. చాలు సామీ చాలు.. మీరు చెప్పిన వెజిటబుల్ బిర్యానీ ఫ్యామిలీ సైజ్‌లో ఇవ్వండి..
**ఆపరేటర్ :** ఖచ్చితంగా సార్... పది మంది ఉన్న మీ కుటుంబానికి అది ఖచ్చితంగా సరిపోతుంది. బిల్ అమౌంటు 2350 రూపాయలు సార్...
**కస్టమర్ :** నేను నా క్రెడిట్ కార్డ్‌లో నేను కట్ట వచ్చా...?
**ఆపరేటర్ :** లేదు సార్... మీరు క్యాష్ రూపంలోనే చెల్లించాలి. మీ క్రెడిట్ కార్డు లిమిట్ ఎప్పుడో అయిపోయింది. అదీకాకుండా జనవరిలో మీరు 1,50,648 రూపాయలు క్రెడిట్ బాకీ పెట్టి ఉన్నారు.
**కస్టమర్ :** నేను ఎలాగైనా క్యాష్ రెడీ చేస్తాను. మీరు బిర్యానీ పంపండి. ఎంత టైం పడుతుంది..?
**ఆపరేటర్ :** 45 నిమిషాలు పడుతుంది. సార్,, అంతసేపు మీరు వెయిట్ చేయలేకపోతే మీ బైక్ లో వచ్చి మీరే తీసుకెళ్ళచ్చు సార్...
**కస్టమర్ :** ఎంటి..?
**ఆపరేటర్ :** మీ ఆధార్ కార్డు ప్రకారం మీ దర్గర ఒక బైక్ ఉంది. దాని నెంబర్ 1122
**కస్టమర్ :** మీరు ప్రకటన లో చెప్పిన విధంగా ఆ మూడు ఫ్రీ కోక్ బాటిల్స్ కలిపి పంపండి.
**ఆపరేటర్ :** బిర్యాని మాత్రమే పంపిస్తాం సార్ మీ మెడికల్ రిపోర్ట్ ప్రకారం మీ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకునే మీకు ఆ కోక్‌ని ఇవ్వలేం సార్..
**కస్టమర్ :** (ఇక్కడ రాయలేని మాటలు)...
**ఆపరేటర్ :** సార్,, మాటలు జాగ్రత్తగా మాట్లాడండి. సార్. ఇలానే ఒక పోలీస్ దగ్గర తిట్టినందుకు కోర్టు మీకు రెండు నెలలు జైలు శిక్ష మరియు 5000 రూపాయల జరిమానా విధించింది మర్చిపోయారా?
**కస్టమర్ :** ధాం... అని కళ్ళు తిరిగి కింద పడిపోయాడు.

చదివేటప్పుడు చూసేటపుడు ఇది సరదాగానే ఉంటుంది. కానీ ప్రభుత్వం ప్రతీ దానికి ఆధార్ కార్డ్‌ను లింక్ పెడుతుంది. దీని కోసమే. భవిష్యత్తులో జరగబోయేది ఇదే అందరూ తెలుసుకోండి.

## జీజీహెచ్‌లో ‘మానవ సేవ’

**రావా ప్రతినిధి, గుంటూరు :** గుంటూరు సర్వజనాసుపత్రిలో(జీజీహెచ్) ‘మానవ సేవ’ సంస్థ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలందించడానికి, వారి బంధువులకు సహాయపడటానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ‘మాన వ సేవ’ పట్ల ఆసక్తి ఉన్న వారెవరైనా సరే ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. ఆసక్తిగల వారు తమకు నచ్చిన రోజున ఆస్పత్రికి వచ్చి కొన్ని గంటల పాటు రోగులకు సేవలందించడమే ఈ మానవసేవ కార్యక్రమం. దేశం లో ఎక్కడా లేని విధంగా గుంటూరు ఆస్పత్రిలో అమలు పరుస్తున్న ఈ కార్యక్రమంలో ఇంత వరకు540 మంది స్వచ్ఛందంగా వచ్చి సేవలందించారు.ఎక్కువగా విద్యార్థులు ఈ మానవ సేవలో పాల్గొంటున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆస్పత్రిలో మానవ సేవ చేసే సమయంలో‘మానవ సేవ’పేరుతోఉన్న కండువాను ధరించాల్సి ఉంటుంది. ఉదయం 9నుంచి మధ్యాహ్నం2 వరకు సేవా కార్యక్రమంలో పాల్గొనవచ్చు.

# స్వాతంత్ర్య కాంక్షను పెంచిన 'హాజీ'

## హాజీ షరియతుల్లా (1780- 1839)



6 స్వాతంత్ర్యపోరాటచరిత్రలో విప్లవకారులకు స్ఫూర్తిగా ప్రసాదించిన ఉద్యమాలలో ప్రముఖ స్థానం పొందిన 'ఫరైజీ ఉద్యమం' నిర్మాత హాజీ షరీయతుల్లా 1780లో తూర్పు బెంగాల్‌లోని షరీద్‌పూర్ జిల్లా, బహదూర్/బందర్‌లకోట గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి అబ్దుల్ జాలిబ్, చేనేత వృత్తికారుల కుటుంబానికి చెందిన షరియతుల్లా 18వ ఏటనే మక్కా వెళ్ళారు. అక్కడ ధార్మిక గ్రంథాలను అధ్యయనం చేసి పండితుడిగా రాటుదేలిన ఆయన వహాబీ ఉద్యమ నిర్మాత సయ్యద్ అహమ్మద్ బరేల్వి, వహాబి ఉద్యమానికి సమరశీలత జోడించిన కార్యశూరులు 'టిటూ మీర్'గా సుప్రసిద్ధులైన సయ్యద్ మీర్ నిసార్ అలీ లను కలుసుకున్నారు ఆ కలయిక పర్యవసానంగా తనదైన ధార్మిక–లౌకిక మార్గాన్ని నిర్దేశించుకుని హాజీ షరీయతుల్లా 1802లో ఫరీద్‌పూర్ చేరుకున్నారు. స్వదేశం చేరుకోగానే తాను మక్కాలో నిర్ణయించుకున్న లక్ష్యాల సాధనకు ప్రస్తుత బంగ్లాదేశ్ రాజధాని ఢాకా సమీపాన గల నవాబారి గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని ధార్మిక బోధనలతో ఆరంభించారు. ఆయన ఉద్యమం 'ఫరైజీ ఉదమ్యం'గా ఆయన అనుచరులు 'ఫరైజీలు'గా చరిత్ర పుటలకు ఎక్కారు. ఇస్లాం ధర్మం ప్రకారంగా తప్పనిసరిగా అనుసరించాల్సిన విధులను నిర్దేశిస్తూ ధార్మిక పర్యటనలుగావిస్తున్న సందర్భంగా గ్రామీణులు, ప్రధానంగా రైతులు, కులవృత్తులను అనుసరిస్తున్న కుటుంబాలు పడుతున్న వెతలకు ఆంగ్లేయ పాలకవర్గాలు, వారి తొత్తులైన జమిందారులు, వడ్డీ వ్యాపారులైన మహాజనులు, కంపెనీ అధికారులు ప్రధాన కారణమని ఆయన గ్రహించారు. ఆ సమస్యల నుండి ప్రజలకు విముక్తం చేయడానికి హాజీ షరీయతుల్లా పోరుబాటను నిర్ణయించుకున్నారు. పలు వర్గాల ప్రజలను, రైతాంగాన్ని చేతివృత్తుల వారిని ఆయన సమీకరించుకున్నారు. ఆ తరువాత మాతృదేశాన్ని ఆంగ్లేయుల పాలన నుండి విముక్తం చేయడానికి ప్రజలను ఉద్యమం దిశగా ప్రేరేపిస్తూ ముందుగా సాగారు. ప్రజల పక్షంగా నిలచి ఆంగ్లేయుల మిద, స్వదేశీ జమిందారులు, ప్లాంటర్ల పలు మిద పోరాటాలు సాగించివిజయాలు సాధించారు. అన్ని విషయాలలో ప్రజలకు మార్గదర్శకత్వం వహిస్తూ, పాలకవర్గాల చట్టపరమైన ఉచ్చులలో ఏమాత్రం చిక్కుకోకుండా షరియతుల్లా జాగ్రత్త పడినందున చట్టాలు, కోర్టులు హాజీ షరీయతుల్లా దరి చేరలేక పోయాయి. అరాచకాన్ని ఎదుర్కోవటం మాత్రమే కాకుండా ప్రజల్లో స్వేచ్ఛాకాంక్షను, స్వతంత్ర భావాలను ఉద్దీపింపచేయడంలో షరియతుల్లా ప్రబోధాలు, ఫరాజీ ఉద్యమం ఎంతగానో ఉపయోగపడింది. అర్థ శతాబ్దికి పైగా ఉధృతంగా సాగి, మరో 50 ఏండ్ల పాటు 'ఫరైజీ ఉద్యమం' ద్వారా సమాజాన్ని ప్రభావితం చేసిన హాజీ షరియతుల్లా సాహసోపేతమైన చర్యలు స్వాతంత్ర్య సమర చరిత్రలో చిరస్థాయిగా నిలచి, స్వాతంత్ర్యోద్యమ సాయుధ పోరాట యోధులకు ప్రేరణగా నిలిచాయి. ఆది నుండి అంతం వరకు ప్రజల పక్షం వహించి పరాయి పాలకులకు, స్వదేశీ దోపిడిదారులకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించిన 'ఫరైజీ ఉద్యమ' నిర్మాత హాజీ షరియతుల్లా 1839లో కన్నుమూశారు.


Syed Naseer Ahamed
Mobile: 9440241727.
E-mail: naseerahamedsyed@gmail.com

**(ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు ఆల్బమ్ 'చరితార్థులు' నుంచి....)**


## మన కోసం

| | | | | |
|---|---|---|---|---|
| | శ్రీ విజయలక్ష్మి జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| రెస్టారెంట్స్ | బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| రెస్టారెంట్స్ | స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| రెస్టారెంట్స్ | ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |
| షాప్స్ | రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| షాప్స్ | వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| షాప్స్ | బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| షాప్స్ | కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| షాప్స్ | వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్‌వి. పున్నారావు | 9848407935 |
| షాప్స్ | చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| షాప్స్ | ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| షాప్స్ | అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| ట్రేడర్స్ | సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| ట్రేడర్స్ | శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

### మ్యారేజీ లింగ్స్

షేక్ జానీ విజయవాడ 9948450761


## 9 మంది డీఎస్పీల బదిలీ

**రా.వా.ప్రతినిధి– అమరావతి :** రాష్ట్రంలో 9 మంది సివిల్ డీఎస్పీలను బదిలీ, పోస్టింగ్‌లను ఇస్తూ డీజీపీ నండూరి సాంబశివరావు ఆదేశాలు జారీ చేశారు.వెయిటింగ్‌లో ఉన్న డీఎస్సీలు కె లతామాధురి, కే ఈశ్వరరావులను సీఐడీ డీఎస్పీలుగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న పి జోషువాను విజయవాడ నగర ఎసీపీగా ఎస్‌కే చంద్రశేఖర్‌ను కడప స్పెషల్ బ్రాంచి (ఎస్బీ) డీఎస్పీగా, ఎన్ వెంకటరెడ్డిని గుంటూరు అర్బన్ ఎస్బీ డీఎస్పీగా బదిలీ చేశారు. గుంటూరు ఎస్బీ డీఎస్పీగా చేస్తున్న బి నాగేశ్వరరావును పోలిస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. వెయిటింగ్‌లో ఉన్న పి సత్యనారాయణను రాజమండ్రి అర్బర్ ఎస్బీ డీఎస్పీగా, కర్నూలుజిల్లా ఆత్మకూరులో ఎస్డీపీఓగా చేస్తున్న కె సుప్రజను పీసీఎస్ అండ్ ఎస్ డీఎస్పీగా నియమించారు ఇక్కడ డీఎస్పీగా చేస్తున్న ఎస్బీ మాధవరెడ్డిని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని డీజీపీ ఆదేశించారు.

## కోడలు పిల్లా.కామ్

# ఆలోచించు అత్తమ్మా!



"హాయ్ పెద్దమ్మా, పెదనాన్నా! రండిరండి,డిసిప్లిన్.. చెప్పిన టైంకి ఒక్క నిమిషం అటూఇటూ కాలేదు" ఆనంద్, భారతీలకి ఆహ్వానం పలికి లోనికి తీసుకొచ్చింది సీత

"అమెరికాలో అన్నేళ్ళున్నాక పంక్చువాలిటీ ఆటోమాటిగ్గా వచ్చేస్తుంది" నవ్వింది" భారతి టైం అనేది పాటించని మనవాళ్ళకి ఆ దేశంలో తర్ఫీదిప్పిస్తే బాగుణ్ణు

" ఒద్దులేవే తల్లీ మనవాళ్ళు మారకపోగా అక్కడివాళ్ళని చెడగొడ్తే కష్టం"

"ఎంత మాటన్నావ్ పెద్దమ్మా?"

"అవును మరి ఆర్నెల్లు స్నేహం చేస్తే వాళ్ళు వీళ్ళవుతారని సామెతుందిగా" అంది సుమిత్ర

" ఇదేదో బాగానేవుంది అత్తా అమెరికావాళ్ళు ఇన్‌డిసిప్లిన్డ్‌గా తయారైతే మన కేంపోయింది. మనవాళ్ళు క్రమశిక్షణ నేర్చుకుని వస్తే అంతేచాలు" అంది సీత

" నీ స్వార్థం తగలెయ్యా, వీళ్ళు బాగుపడ్డం కోసం మావాళ్ళు చెడిపోవాలా?" అంది భారతి

" అన్యాయం పెద్దమ్మా, మదరిండియాని వదిలేసి అదే నీ దేశమైనట్లు మాట్లాడ్తున్నావ్"

" అలాంటి బోర్డర్లేం అక్కర్లేదు. అక్కడుంటున్నాం కాబట్టి వాళ్ళూ మరి. నిజానికి నాది యూనివర్సల్ థింకింగ్ కొన్ని సన్కృతులు ఇక్కడివి బాగుంటే కొన్ని పద్ధతులు అక్కడివి బాగుంటాయి. అక్కడ ఆత్మీయత, అనుబంధం వెతికి చూసినా కనిపించక బాధేస్తుంది.. ఇక్కడేమో బద్ధకం జాస్తి"

" అవును మంచి ఎక్కడున్నా నేర్చుకోవాలి, చెడు ఎక్కడున్నా వదిలేయాలి" అన్నాడు ఆనంద్.

"భేషైన మాట ! ముందు వేడివేడిగా సూప్ తాగండి.. కాసేపాగి భోంచేద్దాం " అని టొమేటోసూప్ అందించింది సీత

" అమెరికాలో మీరుండేదెక్కడమ్మా?" అడిగింది సుమిత్ర.

"శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒదినా.. వాతావరణం చాలా బాగుంటుంది.. ఒకసారి టూరిస్ట్ వీసామీద రండి" నవ్వింది భారతి

నిజమే, అలా ప్లాన్ చేయండి సీతా! ఇంతకీ ఎవరూ లేరేంటి, మీరిద్దరే వున్నారు?" అన్నాడు ఆనంద్.

" అవును కదూ.. సారీ సీతా పాపం మాకోసం సెలవు పెట్టావ్... భీమ్లీ ప్రోగ్రాం లేకుంటే ఆదివారమే ఆదివారమే వచ్చేవాళ్ళం" సరదాగా అన్నాన్లూ, మొన్నే చెప్పారుగా.. వెళ్ళేలోగా అన్నిచోట్లకీ వెళ్ళాలిగా మరి! అన్నట్టు పిల్లలు కూడా వస్తే బాగుండేది"

" పవన్‌కి లీవ్ దొరకలేదు సమీర పీజీ అయిపోయాక వస్తానంది" అన్నాడు ఆనంద్.

"పవన్‌కి సంబంధాలు చూస్తున్నారా భారతీ?" అడిగింది సుమిత్ర.

"ఈ కాలం పిల్లల్ని అందులో అమెరికాలో స్థిరపడ్డ కుర్రాడికి సంబంధం చూడాలేంటి? ఈపాటికే వైట్‌నో, బ్లాక్‌నో ఎంచుకునుంటాడు.. ఏం పెద్దమ్మా" నవ్వింది సీత.

"నీకో ఫాక్ట్ చెప్పనా సీతా, మన మగపిల్లలు అక్కడమ్మాయిల్ని, ఆడపిల్లలేమో ఇండియా కుర్రాళ్ళని ఛస్తే చేసుకోమంటున్నారు." అన్నాడు ఆనంద్.

"ఎందుకలా?" అడిగింది సీత

ఎందుకేంటి? విధేయంగా వుండేపెళ్ళాల్ని చూసీచూసీ వినయవతినే చేసుకోవాలనుకుంటారు.అక్కడి కేర్‌నాట్ గాళ్ళంటే మన కుర్రాళ్ళకి హడల్"

" అవునే లేచిందగ్గర్నుంచీ అన్నీ అందించాలంటే అక్కడి గాళ్స్ తన్నితగలేయరూ? ! అది సరే అమ్మాయిలెందుకు ఇక్కడి వాళ్ళని వద్దంటున్నారు?"

" వెరీ సింపుల్! అక్కడంత స్వేచ్ఛగా పెరిగాక వీళ్ళ పెఉత్తనంలోకి వచ్చేసి లక్షాతొంభై ఆంక్షలతో బ్రతకాలంటే నచ్చుతుంది?" అంది భారతి

"కాలం మారిందిగా పెద్దమ్మా, అమ్మాయిల్లో ఒద్దిక తగ్గినట్లే మగపిల్లల్లో ఆధిపత్య ధోరణి చాలావరకూ తగ్గింది!

" అదేం చెప్పుకోదగ్గ మార్పు కాదు సీతా" అన్నాడు ఆనంద్.

" ఇప్పటికీ మగపిల్లలు మంచినీళ్ళు ఇవాళ్ళ దగ్గర్నించీ పెళ్ళాం అందివ్వాలనే ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. ఆ వైఖరివల్లే సమస్యలొస్తున్నాయి. ఇంటిపట్టునుండే ఆడవాళ్ళలా ఇవాల్టి వర్కింగ్ విమెన్ అన్నీ అమర్చాలంటే ఎలా కుదుర్తుంది ?" మగపిల్లలు ఇంటి పని షేర్ చేసుకోకపోగా ఎదురు సేవచేయాలేక మేల్ షావనిజాన్ని తిట్టిపోస్తున్నారు."అంది భారతి

"అన్నట్టు అక్కడ చాలామంది డిప్రెషన్‌కి గురవుతున్నారటగా పెదనాన్నా? దేనికైనా ఔట్‌లెట్ వుండాలిగా"

అన్నాడు ఆనంద్.

"ఇంటిపనులు ఇద్దరూ షేర్ చేసుకుంటారని విన్నాను.?!" అంది సీత.

"మీపెద్దమ్మకి కాపీ కూడా నేనే కలిపిస్తాను, కావాలంటే అడుగు నవ్వేడు ఆనంద్

" అదొక్కటేనమ్మా ఆయనగారు చేసే పని ఐఇన్‌స్టంట్ పౌడర్‌తో కాఫీ కలిపివ్వడం కూడా ఘనకార్యమేనా?" అంది భారతి.

" విన్నావుగాఅత్తా! రేపట్నుంచీ బావని కూరలు తరగమని చెప్పు" అంది సీత

"కొంపతీసీ నువ్వు పనీపాటా మానేసి పేకాడ్తావా? అయినా నా కొడుకు ఇప్పుడు మాత్రం దర్జాగా కూర్చుంటున్నాడా?

నీళ్ళు పట్టడంలాంటి పనులన్నీ చేస్తాడుగామ్మా" అని రాగం తీసింది సుమిత్ర.

" పవన్ ఇంటిపనులు చేస్తాడా పెద్దమ్మా"అడిగింది సీత.

" నేర్పించాను. వచ్చే పెళ్ళామే అన్నీ చేయాలంటే అది కాస్తా డివోర్స్ ఇచ్చేసి వెళ్ళిపోతుంది. ఆడవాళ్ళ అసమానత్వాన్ని తిట్టుకుంటూ కూడా మగపిల్లలకి ఇంటిపనులు పురమాయించరు.అమ్మాయిలకి ధైర్యాన్ని నేర్పరు" అంది భారతి.

" ఆడపిల్లలకి ధైర్యం లేకపోవడమేంటి, పబ్‌కల్చర్‌కి కూడా అలవాటుపడ్తోంటే" నవ్వింది సీత

"ఎక్కుడో ట్రాక్ తప్పిన వాళ్ళ సంగతి కాదులేవే సీతా" అంది భారతి

అప్పటికే స్త్రైప్‌లోకి వచ్చిన పవన్ "హెలోనాన్నా! ఏమ్మా, అప్పుడే స్పీచ్‌లివ్వడం మొదలెట్టేశావా? సీతక్కా! బాయ్‌స్ ఇన్నో సెంట్‌గా ఇంటి పనులు చేయాలి, గాళ్స్ డేర్‌డెవిల్స్‌లా రోడ్లు పట్టుకు తిరగాలనేది అమ్మ థియరీ. మీరుగానీ ఛాన్సిస్తే రోజంతా రివైండ్ అండ్ ప్లే చేస్తూనే వుంటుంది జాగ్రత్త.. హాయ్ సుమిత్రత్తా బాగున్నావా? ఓకే, హ్యావె గుడ్డే..."అంటూ అందరితో కొంచెంకొంచెం మాట్లాడి కాల్ డిస్‌కనెక్ట్ చేశాడు.అంతా హాయిగా నవ్వుకున్నారు.

**– లేఖ**

# చిన్న కంపెనీల్లో పెద్దల పెట్టుబడి

- స్టార్టప్ కంపెనీలపై పారిశ్రామిక దిగ్గజాలు, సెలబ్రిటీల భారీ బెట్టింగ్
- జాబితాలో రతన్ టాటా నెంబర్ వన్



భారత ఆర్థిక వ్యవస్థలో స్టార్టప్ అనేది బజ్‌వర్డ్‌గా మారిపోయింది. నవతరం వినూత్న, సృజనాత్మక ఆలోచనలతో స్టార్టప్ కంపెనీలు (ఆరంభ/అంకుర) పురుడు పోసుకుంటున్నాయి. ప్రతి ఆలోచన ఒక మొబైల్ అప్లికేషన్ రూపంలోకి మారిపోతోంది. మారుతున్న ప్రజల అభిరుచులు, అలవాట్లకు అనుగుణంగా సేవలు అందించేందుకు స్టార్టప్ కంపెనీలను ప్రారంభిస్తూ ఎంతో మంది ఎంటర్‌ప్రెన్యూర్లుగా అవతరిస్తున్నారు. ముఖ్యంగా యువత ఈ విషయంలో ముందుంటోంది. ఇంటర్నెట్ విస్తరణ నేపథ్యంలో మొబైల్ ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. పల్లెల్లోనూ ఇంటర్నెట్ లేనిదే రోజు గడవని పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో రోజువారీ అవసరాలు తీర్చడంతోపాటు అనేక రకాల సేవలను అందించే స్టార్టప్ కంపెనీల సంఖ్య పెరిగిపోతోంది. వీటి వ్యాపారం కూడా విస్తరిస్తున్నందు వల్ల ఆయా కంపెనీల్లో పారిశ్రామిక దిగ్గజాలు, వివిధ రంగాల్లోని సెలబ్రిటీలు పెట్టుబడులు పెడుతూ పెద్ద ఎత్తున సంపదను పెంచుకుంటున్నారు. పారిశ్రామిక రంగంలో అపూర్వ అనుభవం ఉన్న వారు ఇలాంటి స్టార్టప్ కంపెనీలకు తగిన సలహాలు సూచనలు చేస్తూ మెంటార్లుగా స్థిరపడిపోతున్నారు. ఆయా కంపెనీలకు ప్రచారం చేస్తూ వ్యాపార అవకాశాలు పెరిగే విధంగానూ కృషి చేస్తున్నారు. ఇదంతా నేటి కాలంలో చోటు చేసుకుంటున్న సరికొత్త పంథా అని చెప్పుకోవచ్చు.

**ప్రతి అవసరాన్ని తీర్చేందుకు ఒక స్టార్టప్**

ఇప్పుడంతా ఆన్‌లైన్ ప్రపంచమే. ఇంట్లోంచి అడుగు బయటపెట్టకుండా మన అవసరాలను తీర్చుకోవచ్చు. ఉప్పు, పప్పు వంటి నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, సినిమా టికెట్లు, విమాన టికెట్లు, అనేక రకాల ఉత్పత్తులు, రెడీ టు ఈట్ ఆహారం మరెన్నింటినో నిమిషాల వ్యవధిలోనే మొబైల్ అప్లికేషన్లను వినియోగించి కొనుగోలు చేయవచ్చు. ఇవి ఇంటికే డెలివరీ అవుతాయి. వీటికి చెల్లింపులూ డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లోనే చేయవచ్చు. ఇలాంటి సదుపాయాలను అందించేందుకే స్టార్టప్ కంపెనీలు అవతరించాయి. టెక్నాలజీని ఆధారంగా చేసుకుని ఈ కంపెనీలు పట్టణాల్లో ఇప్పటికే సంచలనం సృష్టిస్తున్నాయి. స్టార్టప్స్ మూలంగా మొత్తం వ్యాపార ధోరణియే మారిపోయింది. ఈ కంపెనీలు పెద్ద ఎత్తున ఆఫర్లు, డిస్కౌంట్లు ఇస్తున్నా నేపథ్యంలో జనాలు ఎగబడి కొనుగోలు చేస్తుండటంతో ఆయా స్టార్టప్ వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. దీనికంతటికీ కేంద్ర బిందువు మొబైల్ ఫోనే.

**40కి పైగా కంపెనీల్లో రతన్ టాటా పెట్టుబడి.**

స్టార్టప్ కంపెనీలు వాటి వినూత్న వ్యాపార ప్రణాళికలతో అన్నీ వర్గాల వారినీ అబ్బురపరుస్తున్నాయి. ఈ కంపెనీలు చేస్తున్న వ్యాపారాలు భారీ స్థాయిలో విస్తరించేందుకు అవకాశం ఉన్నందు వల్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక రంగంలోని దిగ్గజాలు, సెలబ్రిటీలు ముందుకు వస్తున్నారు. ఇలాంటి వారిలో ప్రస్తుతం టాటా గ్రూప్ గౌరవ చైర్మన్‌గా ఉన్న రతన్ టాటా ముందు వరుసలో ఉన్నారు. ఈయన నలభైకి పైగా స్టార్టప్ కంపెనీల్లో తన సొంత డబ్బును పెట్టుబడిగా పెట్టారు. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు టాటా గ్రూప్ విస్తరించింది. ఈ గ్రూప్‌నకు చైర్మన్‌గా వ్యవహరించిన రతన్ టాటా అపార అనుభవాలను సొంతం చేసుకున్నారు. ఏ వ్యాపారం ఏ స్థాయిలో వృద్ధి చెందడానికి అవకాశంఉందో ఇట్టే పసిగట్టే సామర్థ్యం ఆయన సొంతం. అందుకే ఆయన తన పెట్టుబడుల కోసం స్టార్టప్ కంపెనీలను ఎంచుకున్నారు. 2012 సంవత్సరంలో టాటా గ్రూప్ చైర్మన్ పదవి నుంచి రతన్ టాటా తప్పుకున్నారు.అప్పటి నుంచి ఆయన దేశంలో పురోగతి సాధిస్తున్నా స్టార్టప్ వాతావరణంపై దృష్టిసారించడం మొదలుపెట్టారు. స్టార్టప్ కంపెనీల్లో తన పెట్టుబడుల ద్వారా కంపెనీలకు,తనకూ ప్రయోజనం కలుగుతుందని నిర్ణయించుకున్నారు.వెంటనే స్టార్టప్ ఇన్వెస్టర్‌గా అవతారమెత్తారు. రతన్ టాటా ఇప్పటి వరకు పెట్టుబడులు పెట్టిన కంపెనీల్లో ఇన్‌కామర్స్ సంస్థలైన స్నాప్‌డీల్, పేటీఎం, ఆన్‌లైన్ ఫర్నీచర్ అమ్మకాల సంస్థ అర్బన్ లాడర్, ఆన్‌లైన్‌లో ఆభరణాలను విక్రయించే బ్లూస్టోన్, క్యాబ్ సర్వీసులు అందించే ఓలా, చైనా మొబైల్ ఫోన్ల కంపెనీ షామీ, జివేమ్, ఫస్ట్‌క్రై, కార్‌దేఖో వంటి కంపెనీల్లో రతన్ టాటా పెట్టుబడులు పెట్టారు. ఇ-కామర్స్, డిజిటల్ పేమెంట్, ఆన్‌డిమాండ్, డేటా ఎనలిటిక్స్ వంటి టెక్నాలజీ విభాగాల్లోని స్టార్టప్ కంపెనీల్లో రతన్ టాటా పెట్టుబడులు ఉన్నాయి. 2016 ఆర్థిక సంవత్సరంలో 22 కంపెనీల్లో రతన్ టాటా మైనారిటీ వాటా తీసుకున్నారు. టాటా పెట్టుబడులు పెట్టిన కంపెనీల్లో ఎనిమిది ప్రముఖ కంపెనీలు రాబడి 2016 మార్చి నాటికి 1,401 కోట్ల రూపాయలుగా ఉండటం విశేషం.

**సెలబ్రిటీలతో అధిక ప్రచారం..**

ఏ కంపెనీ అయినా ప్రజల్లోకి చొచ్చుకుపోవాలంటే తగిన ప్రచారం తప్పనిసరి. ఎంత గొప్ప ఉత్పత్తిని అందుబాటులోకి తెచ్చినా దానికి ప్రచారం లేకుంటే ఎవరూ కొనరు. అందుకే సెలబ్రిటీలతో కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన ప్రకటనలు చేస్తుంటాయి. అయితే స్టార్టప్ కంపెనీల వృద్ధి ప్రణాళికలు ఆకర్షణీయంగా ఉంటుండటంతో సెలబ్రిటీలు కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా పెట్టుబడులు పెడుతున్నారు. దీనివల్ల అదనంగా సంపదను ఆర్జిస్తున్నారు. సెలబ్రిటీలు పెట్టుబడుల కోసం ముందుకురావడం స్టార్టప్‌లకు ఎక్కువగా కలిసి వస్తోంది.

**మరికొంత మంది ప్రముఖ ఇన్వెస్టర్లు..**

- ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు యుఐడిఎఐకి సారథ్యం వహించిన నందన్ నీలేకని స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. మధ్యశ్రేణి స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఈయన ఒక ఇన్వెస్ట్‌మెంట్ సంస్థను ఏర్పాటు చేసే పనిలో తలమునకలై ఉన్నారు.
- ఆన్‌లైన్ ద్వారా చిన్న కంపెనీలకు రుణాలను అందించేందుకు ఇన్ఫోసిస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వి బాలకృష్ణన్ బిలియన్‌లోన్స్ పేరుతో ఒక సంస్థను స్థాపించారు. ఈయన ఇప్పటికే మూడు నాలుగు స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టారు. మరిన్ని కంపెనీలపై దృష్టి పెట్టారు.
- ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్.. హైదరాబాద్‌కు చెందిన స్మార్ట్‌ఫోన్లు, ఇతర డివైజ్‌లను తయారు చేస్తున్న స్మాట్రాన్ అనే కంపెనీలో పెట్టుబడి పెట్టారు. ఈ కంపెనీకి ఆయనే ప్రచారకర్తగా కూడా వ్యవహరిస్తుండటం విశేషం.
- డిస్కౌంట్ రేట్లకు ఇళ్లు ఎక్కడ లభిస్తాయో తెలియజేసే గ్రూప్ హోమ్ బయ్యర్స్ అనే స్టార్టప్ కంపెనీలో బాలీవుడ్ నటి శిల్పా షెట్టి పెట్టుబడి పెట్టారు.
- సింగపూర్‌కు చెందిన క్లౌడ్ సర్వీసుల సంస్థ జిద్దులో బాలీవుడ్ దిగ్గజం అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్‌లు పెట్టుబడి పెట్టారు. జస్ట్‌డయల్ అనే కంపెనీల్లో బచ్చన్‌కు వాటా ఉంది. ఈ కంపెనీకి ఆయనే ప్రచారం చేస్తున్నారు.
- టెన్నిస్ ప్లేయర్ మహేష్ భూపతి.. స్పోర్ట్స్, ఫిట్‌నెస్ ఉత్పత్తులను తయారు చేస్తున్న 'స్పోర్ట్స్ 365 స్టార్టప్‌లో ఇన్వెస్ట్ చేశారు.
- యువత అభిరుచులకు అనుగుణంగా కంటెంట్‌ను ప్రదర్శించే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'క్యుకి'లో ఎఆర్ రెహమాన్ పెట్టుబడి పెట్టారు.
- ప్రయాణానికి సంబంధించిన సేవలు అందిస్తున్న యాత్రా డాట్‌కామ్‌లో బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్‌ఖాన్ పెట్టుబడి పెట్టారు.
- వేరబుల్ టెక్నాలజీ కంపెనీ గోఖిలో బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్, బేబీ ఓయే కంపెనీలో కరీనా కపూర్, వీడియో సోషల్ నెట్‌వర్క్ 'ఇండి'లో అనిల్‌కపూర్, ఉబెర్ లాంటి క్యాబ్ అగ్రిగేటర్ జుగ్నూలో సౌమ్యటాండన్, టికెట్ ప్లీజ్ కంపెనీలో అజయ్ దేవగన్‌లు పెట్టుబడి పెట్టారు.

# యూపీలో యోగి కక్షసాధింపు

**నోయిడా, గ్రేటర్ నోయిడా పారిశ్రామికవాడలపై కాగ్ ఆడిట్‌కు ఆదేశం**



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో యోగీ ఆదిత్యనాథ్ అఖిలేష్ యాదవ్ హయాంలో జరిగిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం ఆదిత్యనాథ్ విచారణకు ఆదేశిస్తున్నారు. ఏదోవిధంగా ప్రతిపక్షాలను తమ గుప్పెట్లో పెట్టుకోవాలన్న కుట్రతో బీజేపీ ప్రతిపక్ష నేతలపై కేసులు, విచారణకు ఆదేశిస్తోంది. ఆర్‌జేడీ అధినేత లాలు ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులపై ఇటీవల జరిగిన సీబీఐ దాడి, ఈడీ విచారణలు ఎన్‌డీఏ ప్రభుత్వ కక్ష సాధింపులో భాగమేనని ప్రతిపక్షాలు నిందిస్తున్నాయి. తాజాగా యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి సంస్థలు నోయిడా, గ్రేటర్ నోయిడా, యమునా ఎక్స్‌ప్రెస్‌వేలలో అనేక అక్రమాలు, అవినీతి చోటుచేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ మూడు సంస్థలపై కాగ్ ఆడిట్‌కే యూపీ ప్రభుత్వం ఆదేశించింది. గజియాబాద్ అభివృద్ధి సంస్థ (జీడీఏ)లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని ఎన్నికల ప్రచారం సమయంలో ప్రధాని మోడీయా ఊదరగొట్టారు. అందులో భాగంగా యోడీ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటున్నది. తాజాగా ఆ మూడు పారిశ్రామిక సంస్థలపై కాగ్‌కు యోగీ ప్రభుత్వం ఆదేశించడం వివాదస్పదమైంది.

కంప్ట్రోలర్, అడిటర్ జనరల్ (కాగ్) ద్వారా జడీఏపై ఆడిట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అనుమతిచ్చింది. గవర్నరు రామ్ నాయక్ జోక్యం చేసుకున్నా జీడీఏపై ఆడిట్‌కు సమాజ్‌వాదీ ప్రభుత్వం అనుమతించలేదు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత యోగీ కక్షసాదింపునకు పూనుకున్నారు. వరుసగా విచారణకు ఆదేసిస్తున్నారు. జడీఏపై విచారణకు ఆదేశించిన తర్వాత తాజాగా నోయిడా, గ్రేటర్ నోయిడా, యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై కాగ్ విచారణకు యోగి ఆదేశించినట్టు యూపీ పారిశ్రామిక అభివృద్ధి శాఖ ప్రిన్సిప్ సెక్రటరీ అలోక్ సిన్హా వెల్లడించారు.

# డ్వాక్రా మహిళలకు రూ.700 కోట్ల వడ్డీ రాయితీ : సీఎం



**రా.వా.ప్రతినిధి, అమరావతి :** రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు బకాయి ఉన్న రూ.700 కోట్ల వడ్డి రాయితీ విడుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాలకు 2015-16 సంవత్సరానికి గాను మొత్తాన్ని చెల్లించనున్నారు. ఈ నిధుల విడుదలతో రాష్ట్రంలోని 7 లక్షల మంది స్వయం సహాయక సంఘాలకు లబ్ధి చేకూరనుంది. సచివాలయంలో రాష్ట్ర ఆదాయ వ్యయాలపై ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, సంబంధిత అధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాలకు 2014 సంవత్సరం నుంచి వడ్డీ రాయితీ రూపేణా రూ.1842 కోట్లు విడుదల చేశామని, అలాగే పెట్టుబడి నిధి కింద గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంగాలకు రూ.4972 కోట్లు విడుదల చేసినట్లు ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్న 9 లక్షల మహిళా సంఘాల పనితీరుపైఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా సంఘాల ద్వారా అమలవుతున్న ఊరారా పశు గ్రాస క్షేత్రాలు, పండ్లతోటలు, ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాలను కూడా ఆయన సమీక్షించారు. మహిళలంతా ముందుకొచ్చి ప్రభుత్వ పరంగా అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే పెట్టుబడి నిధి, వడ్డీ రాయితీ, మిగిలిన బకాయిలను కూడా విడతల వారీగా విడుదల చేస్తామని చంద్రబాబు వివరించారు.

# నాగపూర్‌లో 'బీఫ్' దాడి

**నలుగురు అరెస్టు**

**నాగపూర్ :** గోరక్షకులు మరోసారి రెచ్చిపోయి ఓ వ్యక్తిపై మూకుమ్మడిగా దాడి చేసిన మరో ఘటన నాగపూర్‌లో వెలుగుచూసింది. బీఫ్ తరలిస్తున్నారన్న నెపంతో 31 ఏళ్ల ముస్లిం వ్యక్తిపై దుండగులు మూకుమ్మడిగా దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇప్పటికే నలుగురిని అదుపు లోకి తీసుకున్నట్టు వెల్లడించారు.'జిల్లాలోని కటోల్ పట్టణానికి చెందిన సలీం ఇస్మాయిల్ షేక్ తన ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళుతుండగా ఐదారుగురు వ్యక్తులు భార్సింగి గ్రామ బస్టాప్ వద్ద ఆయనను అడ్డగించి, బైక్‌పై నుంచి దిగమని ఆదేశించారు. బైక్ డిక్కీలో ఉన్న మాంసాన్ని చూపించమన్నారు. అందుకు ఇస్మాయిల్ నిరాకరించడంతో ఆయనను విచక్షణారహితంగా కొట్టారు' అని నాగపూర్ రూరల్ ఎస్పీ శైలేష్ బాల్కావాడె తెలిపారు. ఈ ఘటనలో ఇస్మాయిల్‌కు ముఖం,మెడపై గాయాలయ్యాయి, ఆయనకు నాగపూర్ ఆసుపత్రిలో చికిత్స అందించి ఇంటికి పంపారని పోలీసువర్గాలు వెల్లడించాయి. ఇద్దర్ని, మిగతా ఇద్దర్ని అరెస్టు చేసినట్టు తెలిపారు.నిందితులను అశ్విన్‌యూక్ (35), రామేశ్వర్ తైవాడ్(42), మోరే శ్వర్ తందూర్కర్(36) జగదీష్ చౌదరి(25)గా గుర్తిం చా మన్నారు. వారిపై ఐపీసీ 326 (ఉద్దేశపూరితంగా మారణాయుధాలతో దాడి చేయడం), 34(ఒకే ఉద్దేశంతో మూకుమ్మడిగా దాడి చేయడం) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఐపీసీ 326 సెక్షన్ కింద అత్యధికంగా యావజ్జీవ కారాగార శిక్ష పడవచ్చు. ఇస్మాయిల్ వద్దనున్న మాంసాన్ని స్వాధీనం చేసుకొని పరీక్షల కోసం నాగపూర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు ఎస్పీ చెప్పారు.



## సామాజిక అన్యాయంపై

# రెండంచుల ఖడ్గం : ఐజీ సునీల్‌కుమార్



సామాజిక అన్యాయంపై చట్టాన్ని ప్రయోగించి సమన్యాయం చేసేందుకే చాలా మంది పోలీసు అధికారులయ్యారు. రాజకీయ ఆక్టోపస్‌లు అన్నిరంగాల్లో విస్తరించి, సామాన్య ప్రజలను నిత్యం వెతలకు గురిచేస్తుంటే అది సహించలేనివారు తమ కలాలకు పదును పెట్టారు. అయితే పెన్నుని - గన్‌ని ఏకకాలంలో తిప్పగల ధీరుడు పీవీ సునీల్‌కుమార్. అందుకే ఆయన రెండంచుల ఖడ్గం. మానవత్వం గల మనిషిగా, నిజాయతీగల పోలీసు అధికారిగా అవినీతిని సహించని సునీల్ సమాజాన్ని అన్నికోణాల్లో పరిశీలించారు. సాహిత్యంలో ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రేమరాహిత్యం నుంచి సామాజిక న్యాయం వరకూ, పోలీసు నుంచి పొలిటీషియన్ వరకూ ఏ అంశం ఆయన కలం స్పృశించినా పాఠకుడికి వ్యంగ్యపు పంట పండినట్టే. అంతర్జాతీయ సాహిత్యంలోనే అరుదూ, తెలుగు సాహిత్యంలో ఆయనకు మాత్రమే ప్రత్యేకం అయిన సెటైరికల్ (వ్యంగ్యం) సాహిత్యంలో సునీల్ దిట్ట. మానవతా వాదిగా అనేక మంచిపనులు చేసిన ఆయన చాలా మంది అనాధ బాలలకు మంచి జీవితం ఇచ్చారు. ఈ మధ్యనే అనుమానాస్పద మృతికి గురైన హైదరాబాద్ బ్యూటీషియన్ శిరీష కుమార్తెకు డిగ్రీవరకు చదువు ఖర్చు భరించడానికి సంసిద్ధం అయ్యారు. ఇది నిజంగా ఎంతో ఆనందదాయకం. ఫ్యాక్షన్ ప్రాంతమైన కడప జిల్లాలో తన కెరీర్ ప్రారంభించారు. ఆయన ఉన్నంత కాలం కడపలో ఒక్క ఫ్యాక్షన్ నేరం కానీ, ఎన్నికల్లో రీపోల్ కానీ లేవు. సంస్కరణలకు, ప్రజాహిత పోలీసింగ్‌ల్లో అనేక ఆవిష్కరణలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు సునీల్.

పశ్చిమ గోదావరి జిల్లా చింతపూడిలో పుట్టి పెనుగొండలో పెరిగిన సునీల్ బాల్యం నుండి చురుకైన విద్యార్థి. పెనుకొండ జడ్‌ఎన్‌వీఆర్ హైస్కూల్, ఎస్‌వీకేపీ కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివారు. పెనుగొండ నుండి ఐపీఎస్‌కు ఎంపికైన మొట్టమొదటి వ్యక్తి ఆయన. తన మిత్రులందరితోనూ ఆత్మీయంగా వ్యవహరిస్తూ ఉంటారు. వృత్తిలో నిబద్ధత, నీతి, నిజాయితీపరుడైన అధికారిగా పేరు గాంచారు. ఆయన రాసిన అనేక కథలు, కథానికలు నవలలు వివిధ పత్రికలలో వచ్చాయి. మాతామహులు ఆంగ్లభాషా పండితులు, ప్రధానోపాధ్యాయులు. షేక్స్పియర్ రచనలని వారే రచయితకు బాల్యంలో పరిచయం చేశారు. తల్లి దయామణి, శరత్ చలం సాహిత్యాల అభిమాని. అలా ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యాల పట్ల అభిరుచి ఏర్పడింది. ప్రవృత్తిరీత్యా పాఠకుడు, రచయిత అయిన సునీల్ కుమార్ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను గుర్తించి ఢిల్లీ తెలుగు అకాడమీ రాష్ట్రీయ వికాస్ శిరోమణి అవార్డును 2014లో అందజేసి గౌరవించగా, తానా సంస్థ 2015 సంవత్సరం జూలై 11న వాషింగ్టన్ డి.సిలో సత్కరించింది.

- హుస్సేన్ ఖాన్

# రీల్ హీరో రియల్ విలన్



నిజం చెప్పాలంటే జైళ్లలో కంటే ఎక్కువ మంది క్రిమినల్స్ సమాజంలో ఉన్నారు. దొరికితే దొంగలు లేదంటే దొరల కిందకే వస్తారు వీరంతా. మహిళలను కించపరిచే, లేదా భయపెట్టి, లైంగిక దాడి జరిపే వారి సంఖ్య తక్కువేమీ కాదు. కాకపోతే సిని పరిశ్రమలో ఇంకొంచెం ఎక్కువగా ఉంటారు. హీరోలు, ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు ఒకరేమిటీ అందరూ అందరే.. ఇప్పటికైతే దిలీప్ వంతయింది.

దిలీప్ 'వెల్ కం టూ సెంట్రల్ జైల్' అనే సినిమాను కొద్దికాలం క్రితం చేశాడు. ఈ మలయాళ నటుడిని సెంట్రల్ జైలు ఆహ్వానిస్తోందని, ఇక అక్కడే శేష జీవితాన్ని గడిపేయాల్సి ఉంటుందని అనేకమంది ఇప్పటికే ఎద్దేవా చేస్తున్నారు. భావనాపై అత్యాచారయత్నాన్ని ప్రోత్సహించే ఒకే ఒక్క ఘటనతో హీరో నుంచి జీరోకు పడిపోయాడు దిలీప్. హీరోయిన్ భావన లైంగిక వేధింపుల కేసులో దిలీప్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కేసు ఇంకా తేలలేదు. కానీ మలయాళీ ప్రేక్షకులు మాత్రం దిలీప్‌ను అప్పుడే దోషిని చేశారు. ఈ వివాదంలో దిలీప్‌అనుమానాస్పద ప్రవర్తనను ఎత్తిచూపుతున్నారు. ఇతడిపై వ్యతిరేకత ఏ స్థాయిలో పెరిగిందంటే.. కొచ్చిలో దిలీప్ చెందిన ఓ పెద్ద హోటల్‌ను కొంతమంది స్థానికులు ధ్వంసం చేశారు. నిజానికి దిలీప్, తను తీసుకున్న గోతిలో తానే పడ్డాడని చెప్పాలి. ఈ కేసులో నిందితులుగా ఉంటూ జైల్లో ఉన్న కొందరు వ్యక్తుల్లో ఒకడు దిలీప్ కు ఓ ఉత్తరం రాశాడు. అతడి పేరు బయటకు చెప్పనందుకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ ఉత్తరంతో తనకు సంబంధం లేదంటూ దిలీప్ పోలీసుల్ని ఆశ్రయించాడు. సరిగ్గా ఈ వ్యవహారం నుంచే పోలీసులు దిలీప్‌ను అనుమానించడం మొదలు పెట్టారు. భావన ఇచ్చిన సమాచారంతో తిరుగులేని సాక్ష్యాధారాలు సేకరించారు. దీంతో దిలీప్ అరెస్ట్ అనివార్యమైంది.

పాతికేళ్ల సినీ జీవితంలో వందకు పైగా సినిమాలు చేశాడు దిలీప్. తన కామెడీ నటనతో తిరుగులేని ప్రేక్షకాదరణ పొందాడు. దీనిలో భాగంగా చాలా అవార్డులు అందుకున్నాడు. అడిగినంత రెమ్యూనరేషన్ గిట్టేది. పరిశ్రమలో పెద్ద మనిషిగా పేరుతెచ్చుకున్న ఇలాంటి వ్యక్తి భావనపై కన్నేశాడు. కోటిన్నర ఇచ్చి కిరాయి రౌడీలతో ఆమెపై లైంగిక దాడి జరిగేట్టు చేశాడు. తన దారిలోకి తెచ్చుకోవాలని విశ్వప్రయత్నం చేశాడు. కానీ భావన మాత్రం చలించలేదు. ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పట్లో భావన చూపించిన చొరవ, ధైర్యానికి సౌత్ సినీ ఇండస్ట్రీ మొత్తం ఆమెకు మద్దతుగా నిలిచింది. ఇప్పుడీ కేసులో డొంక కదులుతోంది. ప్రస్తుతానికి దిలీప్ మాత్రమే జీరో అయ్యాడు. త్వరలోనే మరికొందరు ప్రముఖులు కూడా జీరోలుగా మారతారంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పుడీ వివాదం దిలీప్ భార్య కావ్య మాధవన్ మెడకు కూడా చుట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దిలీప్‌తో పాటు ఆమె కూడా మలయాళీ చిత్ర పరిశ్రమలో కొనసాగుతోంది. దిలీప్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత కూడా సినిమాల్లో నటిగా కొనసాగుతోంది.

భావన కేసుకు సంబంధించి కావ్య మధవన్‌ను కూడా పోలీసులు ప్రశ్నించే అవకాశాలున్నాయి. ఈ మేరకు కొచ్చిలోని ఎడబల్లిలో కావ్య మాధవన్ కు చెందిన ఓ వస్త్ర దుకాణంలో పోలీసులు సోదాలు నిర్వహించి కీలక సాక్ష్యాలు సేకరించారు. మరోవైపు కావ్య మాధవన్ తన వ్యక్తిగత ఫేస్‌బుక్ ఖాతాను మూసేశారు. తన బొటిక్ పేరిట ఉన్న ఫేస్ బుక్ ఎకౌంట్ ను కూడా క్లోజ్ చేశారు. ఇప్పటికే అరెస్టు అయిన కీలక నిందితుడు పుల్సర్ సునీ, దిలీప్ మధ్య కావ్య మాధవన్ మధ్యవర్తిగా ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు.

## ఆగస్టు 21న సూర్యగ్రహణం

### అమెరికావాసులకు కనువిందు, సౌరవిద్యుత్‌పై ఆందోళన

**వాషింగ్టన్ :** చాలా ఏళ్ల తరువాత ఆగస్టు 21న అరుదైన సూర్యగ్రహణం దృశ్యాలు వీక్షించేందుకు అమెరికా ప్రజలు ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఆ రోజు సౌర విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. సూర్యగ్రహణం సందర్భంగా ఆకాశమంతా చీకటిమయం కానుండటంతో సౌరవిద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం ఖాయమంటున్నారు. దీంతో సౌర విద్యుత్ ఉత్పత్తిదారులు ఆందోళన చెందుతున్నారు. సూర్యగ్రహణం ప్రభావంతో దాదాపు 7 మిలియన్ ఇళ్లను సరఫరా అయ్యే విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోనుందని చెబుతున్నారు. ఇది 9 న్యూక్లియర్ రియాక్టర్లలో ఉత్పత్తయ్యే విద్యుత్‌కు సమానం. అమెరికాలోని ఓరెగాన్ ప్రాంతం నుంచి దక్షిణ కరోలినా ప్రాంతం వరకూ దాదాపు 113 కిలోమీటర్ల వరకూ సూర్యగ్రహణం ప్రభావంతో చీకటి అలముకోనుంది. దీని కారణంగా భారీ సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఇళ్లపై సౌర ప్యానళ్ల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్ తగ్గిపోనుందని బ్లూమ్‌బర్గ అనే సంస్థ అంచనావేస్తోంది. దాదాపు 9 వేల మోగావాట్ల ఉత్పత్తి తగ్గిపోనుందని పేర్కొంటోంది. సూర్యగ్రహణం కారణంగా తమ ప్లాంట్‌లో 2.500 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి తగ్గిపోనుందని అంచనా వేస్తున్నట్లు తూర్పు అమెరికా ప్రాంతంలో అతిపెద్ద పవర్‌గ్రిడ్ అయిన పీజేఎం ఇంటర్ కనెక్షన్ ఎల్‌ఎల్‌సీ చెప్పింది. అమెరికా వాసులు చివరిసారిగా 1979లో పూర్తిగ్రహణాన్ని వీక్షించినట్లు నాసా తెలిపింది.

# సల్మాన్‌ను చూసి నేర్చుకోండి ...



భారీ అంచనాల మధ్య వచ్చిన 'ట్యూబ్ లైట్' సినిమా ఫ్లాప్ అయింది. ఈ సినిమాకోసం సల్మాన్‌కు భారీ మొత్తమే ముట్టింది. సల్మాన్ దీనికి నిర్మాతగా వ్యవహరించాడు. దీంతో నష్టపోయిన వారికి రూ. 55కోట్లు వెనక్కు ఇచ్చేస్తానని చెప్పారు.

సల్మాన్ ఖాన్ ఫిలాసఫీ చెప్పడు. తనేదో గొప్ప వ్యక్తినని, తనకుపెద్ద పెద్ద ఆదర్శాలున్నాయని, పెద్ద వాళ్ల పేర్లను చెప్పుకోడు.. వివాదాలు, విమర్శలు ఎన్ని ఉన్నా.. తన జీవితం తనదన్నట్టుగా గడిపేస్తూ ఉంటాడు. మరి అలాంటి వ్యక్తికే తనను నమ్ముకుని కొందరు బజారున పడే సరికి బాధ అనిపించింది. తన సినిమా ప్రి రిలీజ్ మార్కెట్ ను పూర్తిగా క్యాష్ చేసుకున్నాడు. ఇక సినిమా విడుదల అయ్యాకా తొలి షో నుంచినే విమర్శలు తప్పలేదు. సల్మాన్ సినిమాలకు. విమర్శలు ఎంత కామనో, వసూళ్లు కూడా అంతే కామన్. అయితే ట్యూబ్ లైట్ మాత్రం విమర్శలకే పరిమితం అయ్యింది. సినిమా వంద కోట్ల రూపాయల వసూళ్ల మార్కును అయితే దాటింది. దీంతో డిస్ట్రిబ్యూటర్లకు భారీ భారీ నష్టాలు తప్పడం లేదు. ఓవరాల్ గా వంద కోట్ల రూపాయల పై వసూళ్లను సాధించినా ట్యూబ్ లైట్ డిస్ట్రిబ్యూటర్లకు 55కోట్ల వరకూ నష్టమని ట్రేడ్ పండితులు తేల్చారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రీఫండ్ చేయడానికి సల్మాన్ ముందుకు రావడం గమనార్హం. తనే నిర్మాత కాబట్టి.. తనే ప్రీ రిలీజ్ మార్కెట్‌ను సొమ్ము చేసుకున్నాను. కాబట్టి సల్మాన్ ఆ డబ్బును డిస్ట్రిబ్యూటర్లకు రీఫండ్ చేస్తున్నాడు. తద్వారా తనను నమ్మి నష్టపోయిన వారిని ఆదుకుంటున్నాడు. మరి ఆ మధ్య లింగా సినిమా డిస్ట్రిబ్యూటర్లు రోడ్డుకు ఎక్కితే రజనీకాంత్ వాళ్లను పట్టించుకోలేదు. ఆ తర్వాత ఈ మధ్య 'సర్దార్ గబ్బర్ సింగ్' బాధితులు రోడ్డుకు ఎక్కడమే కాదు, నిరాహార దీక్షలు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. అయితే పవన్ వారిని పట్టించుకోలేదు. వారికి నష్టపరిహారం చెల్లించడానికి ముందుకు రాలేదు. మెగాస్టార్ చిరంజీవి తకు కుమారుడు రామ్‌చరణ్‌తో ఆరెంజ్ తీసి నష్టపోయిన తమ్ముడు నాగేంద్రబాబునే కనికరించలేదని వార్తలున్నాయి. దీన్ని బట్టి చూస్తే సల్మాన్ గ్రేట్.

## త్వరలో రామోజీ

# మనవరాలి పెళ్లి



రామోజీరావు పెద్దకుమారుడు ఈనాడు ఎండీ, కిరణ్, శైలజల పెద్ద కుమార్తె చెరుకూరి సహారి వివాహం కోసం రామో ఫిల్మ్ సిటీని అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఇందుకోసం నెల రోజుల నుంచి ఏర్పాటు జరుగుతున్నాయి. సహారి వివాహం ఈనెల 28న రాత్రి 12 గంటల 6 నిమిషాలకు (తెల్లవారితే శనివారం) వైభవంగా జరగనుంది. నగరశివార్ల ప్రాంతంలోని జీనోం ఇంటర్నేషనల్‌సంస్థ అధిపతి ఎల్లా కృష్ణ కుమారుడు వీరేంద్రదేవ్‌తో నిశ్చితార్థం జరిగింది. పెళ్లి రోజు సాయంత్రం ప్రీ-వెడ్డింగ్ రిసెప్షన్ ను గ్రాండ్‌గా ఏర్పాటుచేశారు. ఈ నెల 25 నుంచి రామోజీ ఫిలింసిటీలో సాయంత్రం వేళల్లో ప్రత్యేక ఆంక్షలు విధిస్తున్నారు. దాదాపు ఫిలింసిటీ మొత్తాన్ని విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. రిసెప్షన్, పెళ్లికి వచ్చేవాళ్లు ఫిలింసిటీలో ఎక్కడైనా విహరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దానిలోని రెండు స్టార్ హొటళ్లును (హోటల్ తార,, సితార) పెళ్లిరోజు పూర్తిగా అతిథుల కోసమే కేటాయించారు. ఇప్పటికే పెళ్లి శుభలేఖల పంపిణీ ప్రారంభమైంది. బంధువులతో పాటు సినీ,రాజకీయ ప్రముఖుల్ని పరిమిత సంఖ్యలో ఆహ్వానిస్తున్నారు. వచ్చిన ప్రతి ఒక్కరికి రాయల్ ట్రీట్ మెంట్ ఇవ్వబోతున్నారు. రిసెప్షన్, వివాహానికి వచ్చేవాళ్లకు కళ్లుచెదిరే కానుకలు అందించబోతున్నారు. అతిథులకు ఆ రాత్రి ఫిలింసిటీలోనే బస ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. తెలుగురాష్ట్రాల్లో అత్యంత ఖరీదైన పెళ్లిగా ఇది నిలిచిపోయేంతగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.
D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan,
Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18